అక్షర రాజముద్ర
www.rajamudranews.com
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
RNI No: TELTEL/2024/86684

శుక్రవారం | 20.06.2025 | సంపుటి : 2 | సంచిక :139 | పేజీలు : 8 | వెల : 2/-



ఆధార్ ఉంటేనే తత్కాల్ టికెట్.. 07

విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575

# కృష్ణమ్మ జలసిరి

- ఆల్మట్టి, నారాయణపూర్ గేట్ల నుంచి దిగువకు వరద
- జూరాలలోకి 40వేల క్యూసెక్కులు.. 52వేల క్యూసెక్కుల ఔట్‌ఫ్లో
- శ్రీశైలంలోకి 45వేలు, సాగర్‌లోకి 11వేల క్యూసెక్కులు

03



కృష్ణమ్మ జలసిరిని సంతరించుకుంటోంది. పశ్చిమ కనుమల్లో కురుస్తున్న వర్షాలతో కృష్ణానది పరిధిలోని ప్రాజెక్టుల్లోకి వరద నీరు వస్తోంది. ఆల్మట్టిలోకి 80 వేల క్యూసెక్కుల నీరు వస్తోంది. 27, 967 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. ఆల్మట్టి పూర్తి సామర్థ్యం 129.72 టీఎంసీలు కాగా... ప్రస్తుతం జలాశయంలో 68.55 టీఎంసీల నీరు ఉంది. దిగువన నారాయణపూర్ ప్రాజెక్టులోకి 29,800 వేల క్యూసెక్కుల వరద వస్తోంది. 25,063 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 37.64 టీఎంసీలు కాగా ప్రస్తుతం 29.91 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాలకు 40 వేల క్యూసెక్కులు, తుంగభద్రకు 43 వేల క్యూసెక్కులకు వరద వస్తోంది. 52,468 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు.

తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న గోదావరి - బనకచర్ల ప్రాజెక్టు ప్రీ ఫీజుబిలిటీ రిపోర్టును తిరస్కరించాలని కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాజెక్టు విషయంలో గోదావరి జల వివాదాల ట్రైబ్యునల్ - 1980 (జీడబ్ల్యూడీటీ), ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం - 2014కు విరుద్ధంగా ఏపీ సర్కారు వ్యవహరిస్తోందని తెలిపారు. ఢిల్లీలోని శ్రమశక్తి భవన్‌లో జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్, ఆ శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీతోపాటు ఇతర ఉన్నతాధికారులతో రేవంత్, ఉత్తమ్ గురువారం సమావేశమయ్యారు. బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతుల విషయంలో కేంద్ర ఆర్థిక, పర్యావరణ శాఖలు వ్యవహరిస్తున్న తీరుతో తెలంగాణ ప్రజలు, రైతుల్లో ఆందోళనలు నెలకొన్నాయని చెప్పారు.




# బనకచర్లను అడ్డుకోండి

## ఎపెక్స్ కౌన్సిల్ అనుమతి లేకుండానే ఏపీ ముందుకు వెళ్తోంది

- ట్రైబ్యునల్ తీర్పులో వరద, మిగులు జలాల ప్రస్తావనే లేదు
- జలశక్తి మంత్రికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌ల ఫిర్యాదు
- త్వరలో ఇరు రాష్ట్రాల సీఎంల సమావేశం.. కేంద్ర మంత్రి హామీ ఇచ్చారన్న ఉత్తమ్
- న్యాయం జరగకుంటే సుప్రీంకోర్టుకైనా వెళ్తామని వెల్లడి

**న్యూఢిల్లీ, జూన్ 19 :** "జలవివాదాల విషయంలో తెలంగాణకు సంపూర్ణ న్యాయం చేస్తాం. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుపై త్వరలో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం ఏర్పాటు చేసి చర్చిస్తాం" అని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ హామీ ఇచ్చినట్లు తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. ఇదే అంశంపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ గురువారం మధ్యాహ్నం కేంద్రమంత్రి పాటిల్, ఆ శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీలను కలిసి ఫిర్యాదు చేశారు. "గోదావరి వరద జలాల ఆధారంగా బనకచర్ల ప్రాజెక్టును ప్రతిపాదిస్తున్నట్లు ఏపీ ప్రభుత్వం చెబుతోంది. గోదావరి ట్రైబ్యునల్ తీర్పులో వరదజలాలు, మిగులు జలాల ప్రస్తావనే లేదు. ఏపీ పునర్విభజన చట్టం-2014 ప్రకారం తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడైనా కొత్త ప్రాజెక్టు కట్టాలనుకుంటే ముందుగా ఆ నదీ యాజమాన్య మండలి, సీడబ్ల్యూసీ, జలశక్తి మంత్రి, ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల ఆధ్వర్యంలోని ఎపెక్స్ కౌన్సిల్‌లో చర్చించి అనుమతి పొందాలి. కానీ, బనకచర్ల విషయంలో ఏపీ వీటన్నింటినీ ఉల్లంఘిస్తోంది. వరదజలాల ఆధారంగా ఆ ప్రాజెక్టు



## మెట్రో ఫేజ్-2 మంజూరు చేయండి

- కేంద్ర మంత్రి ఖట్టర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి వినతి
- బ్రిటన్ మాజీ ప్రధాని బ్లెయిర్‌తో ముఖ్యమంత్రి భేటీ
- 'తెలంగాణ రైజింగ్ విజన్'పై బ్లెయిర్ సంస్థతో ఎంవోయూ

02



02

## నేడు ఎల్బీ స్టేడియంలో యోగా కౌంట్‌డౌన్ మహోత్సవం

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరు
- ఏర్పాట్లను పరిశీలించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి




## జీసీసీ విధానంలో ఎలక్ట్రిక్ బస్సులు

- నెలాఖరులో 'పీఎం ఈ-డ్రైవ్' టెండర్లు
- సుమారు ఐదు వేల మంది ఆర్టీసీ డ్రైవర్లపై ప్రభావం
- సర్దుబాటు దిశగా సంస్థ దృష్టి

02



03

## మావోయిస్టులకు సహకరించినట్లు ఆధారాలేంటి?

- వారిపై కేసులేం నమోదు కాలేదు కదా..!
- ఫోన్ల అక్రమ ట్యాపింగ్‌పై ప్రభాకర్‌రావుకు సిట్ ప్రశ్నలు

# బనకచర్లకు పచ్చజెండా ఊపింది రేవంతే

- రాష్ట్ర హక్కులు బాబుకు రాసిస్తే.. ప్రజలు ఊరుకోరు
- కేసీఆర్ హయాంలో ఎపెక్స్ కౌన్సిల్‌లో బనకచర్లపై చర్చే జరగలేదు
- ఏటా 3 వేల టీఎంసీలు సముద్రంలోకి వృథాగా పోతున్నాయని చెప్పింది సీడబ్ల్యూసీనే
- వాటిలో 1,950 టీఎంసీలు తెలంగాణకు కేటాయించాలని కేసీఆర్ డిమాండ్ చేశారు

: మాజీ మంత్రి హరీశ్‌రావు



02

గోదావరిలో 1950 టీఎంసీలు కావాలని కేసీఆర్ గతంలోనే అడిగారని, అలాంటిది నువ్వు 1000 టీఎంసీలు ఇస్తే చాలని, బనకచర్ల ప్రాజెక్టు కట్టుకోవాలని చెబుతావా? అని మాజీ మంత్రి హరీశ్‌రావు సీఎం రేవంత్‌ను నిలదీశారు. రేవంత్‌కు బేసిన్స్, బేసిక్స్ కూడా తెలియవని ఎద్దేవా చేశారు. బుధవారం ఆయన మాట్లాడిన మాటలు చూస్తే బనకచర్లకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లుగా ఉందన్నారు. రేవంత్ తాను నల్లమల పులిబిడ్డనని చెప్పుకొంటాడని.. ఆయన పులిబిడ్డ కాదని, వెకిలి మాటల వెర్రిబిడ్డ అని హరీశ్ ధ్వజమెత్తారు. గురువారం తెలంగాణభవన్‌లో బీఆర్ఎస్ నేతలు నిరంజన్‌రెడ్డి, మాలోతు కవిత, సబితా ఇంద్రారెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, తదితరులతో కలిసి హరీశ్ మీడియాతో మాట్లాడారు.

అసమానతలను సరిచేసేదే

## నిజమైన ప్రజాస్వామ్యం

- భారత రాజ్యాంగం ఓ విప్లవాత్మక సందేశం
- సీజేఐ జస్టిస్ బి.ఆర్. గవాయ్ వ్యాఖ్యలు

03



సమాజంలో పెద్ద సంఖ్యలో ఉన్న బలహీన వర్గాలను అణచివేసే అసమానతలను సరి చేయకుండా ఏ దేశమూ తనను తాను నిజమైన ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకోజాలదని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బి.ఆర్. గవాయ్ స్పష్టం చేశారు. దీర్ఘకాల స్థిరత్వం, సామాజిక విలీనం, సుస్థిర అభివృద్ధికి.. సామాజిక, ఆర్థిక న్యాయం సాధించడం అవసరమని పేర్కొన్నారు.




# రూ.6,405 కోట్లు జమ

- 62.47 లక్షల మంది రైతులకు నగదు బదిలీ పూర్తి
- శరవేగంగా రైతుభరోసా చెల్లింపులు

**హైదరాబాద్, జూన్ 19 :** రైతువేదికల ప్రారంభోత్సవం సందర్భంగా ప్రకటించినమేరకు రాష్ట్ర ప్రభుత్వం శరవేగంగా రైతు భరోసా చెల్లింపులు చేస్తోంది. 9 రోజుల్లో రూ.9,000 కోట్లు జమచేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినమేరకు ఆర్థిక శాఖ వాయువేగంతో రైతుల ఖాతాల్లో నిధులు జమ చేస్తోంది. నాలుగు రోజుల్లోనే 62.47 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.6,405 కోట్లు జమచేసినట్లు ప్రభుత్వం వెల్లడించింది. గురువారం నాటికి ఐదెకరాల వరకు భూములున్న రైతులకు రైతుభరోసా పంపిణీ చేశారు. కోటిన్నర ఎకరాలకు ఎకరానికి రూ.6 వేల చొప్పున చెల్లించేందుకు రూ.9 వేల కోట్ల నిధులు అవసరం.

మిగతా 2 లో



03

బల్కంపేట ఎల్లమ్మ ఆలయానికి

## నీతా అంబానీ రూ.కోటి విరాళం



## దోస్త్ మూడో విడత రిజిస్ట్రేషన్లు, వెబ్ ఆప్షన్ల గడువు పెంపు

03

# పేదల కలలు నెరవేర్చడమే లక్ష్యం

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- వాసాలమర్రిలో ఇళ్ల పట్టాల పంపిణీ

03





## అదనపు కట్నం కోసం వేధింపులు

దుర్గం చెరువులో దూకి యువతి ఆత్మహత్య

04

# అమెరికా వెళ్లే విద్యార్థులకు వీసోదయం

- వీసా ఇంటర్వ్యూలను పునరుద్ధరిస్తున్నట్లు ప్రకటన
- సోషల్ మీడియా ఖాతాలను పరిశీలిస్తామని వెల్లడి

04

అమెరికాలో చదువుల కోసం ఎదురుచూస్తున్న విదేశీ విద్యార్థులకు అగ్రరాజ్యం గుడ్‌న్యూస్ చెప్పింది. ఇటీవల తాత్కాలికంగా నిలిపివేసిన విద్యార్థి వీసా ఇంటర్వ్యూల షెడ్యూలింగ్‌ను మళ్లీ ప్రారంభించింది. అయితే, వీసా కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థుల సోషల్ మీడియా ఖాతాలను తప్పనిసరిగా తనిఖీ చేస్తామని వెల్లడించింది.



www.rajamudranews.com
రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక

# రూ.6,405 కోట్లు జమ

(మొదటిపేజీ తరువాయి)

రిజర్వుబ్యాంకు నుంచి కొంత అప్పుతోపాటు ఇతరత్రా ఆదాయ వనరుల ద్వారా నిధులు సమకూర్చుకుంది. ఈనెల 16నఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయంలో నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమ వేదిక నుంచి వానాకాలం రైతుభరోసా చెల్లింపు ప్రక్రియను ప్రారంభించారు. తొలి రోజు రెండెకరాల వరకు, రెండో రోజు మూడెకరాల వరకు, మూడో రోజు నాలుగెకరాల వరకు, నాలుగో రోజు ఐదెకరాల వరకున్న రైతులకు రైతుభరోసా చెల్లింపులు పూర్తిచేశారు. ఇప్పటివరకు 62.47 లక్షల మంది రైతులకు రూ.6,405 కోట్లు చెల్లించినట్లు వ్యవసాయశాఖ గురువారం వెల్లడించింది. రాష్ట్రంలో కోటిన్నర ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా... కోటి ఎకరాల పైచిలుకు విస్తీర్ణానికి చెల్లింపులు పూర్తయ్యాయి. మరో 50 లక్షల ఎకరాలకు ఐదారు రోజుల్లో చెల్లింపుల ప్రక్రియ పూర్తయ్యే అవకాశాలున్నాయి. ప్రభుత్వం ఈసారి ఎలాంటి పరిమితులు విధించడంలేదు. సాగు భూముల జాబితాలోని మొత్తం విస్తీర్ణానికి రైతుభరోసా చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించారు. అదునుచూసి ప్రభుత్వం పెట్టుబడి సాయం అందిస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నట్లు వ్యవసాయశాఖ తెలిపింది. రికార్డుస్థాయిలో రైతుల ఖాతాల్లో నిధులు జమచేస్తున్నట్లు పేర్కొంది. కాగా ఎలాం టి పరిమితులు విధించకుండా రైతులందరికి రైతుభరోసా చెల్లిస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ పెట్టుబడి సాయాన్ని రైతులు వానాకాలం పంటల సాగు ఖర్చులకు వినియోగించుకోవాలని సూచించారు.




## 12 మంది మావోయిస్టుల లొంగుబాటు

**కొత్తగూడెం :** నిషేధిత మావోయిస్టు పార్టీలో వివిధ హెూదాల్లో పని చేస్తున్న నాయకులు, సభ్యులు మొత్తం 12 మంది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసుల ఎదుట గురువారం లొంగిపోయారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ బి.రోహిత్‌రాజు వివరాలు వెల్లడించారు. లొంగిపోయిన వారిలో డివిజనల్ కమిటీ సభ్యులు ఇద్దరు, ఏరియా కమిటీ సభ్యులు నలుగురు, పార్టీ సభ్యులు ఇద్దరు, మిలీషియా సభ్యులు ఇద్దరు, ఆర్‌పీసీ సభ్యులు ఇద్దరున్నారని తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టులకు తక్షణ సాయంగా ఒక్కొక్కరికి రూ.25వేల చొప్పున మొత్తం రూ.3 లక్షలు అందజేశామన్నారు. క్యాడర్ల వారీగా రివార్డు నగదును వారి ఆధార్ కార్డులు, బ్యాంకు ఖాతాలను తీసుకుని మొత్తం రూ.26 లక్షలను చెక్కుల రూపంలో అందించనున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు.



## నేడు ఎల్బీ స్టేడియంలో యోగా కౌంట్‌డౌన్ మహెూత్సవం

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరు
- ఏర్పాట్లను పరిశీలించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**నారాయణగూడ :** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం తెల్లవారుజామున 5 గంటలకు ఎల్బీ స్టేడియంలో కౌంట్‌డౌన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించనున్నట్లు కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను గురువారం సాయంత్రం భాజపా నేతలతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉత్సవాల్లో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కేంద్ర ఉక్కు, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శ్రీనివాసవర్మ, ఎంపీలు డా.కె.లక్ష్మణ్, ఆర్.కృష్ణయ్య, ఈటల రాజేందర్, డీకే అరుణ, రఘునందన్‌రావులతోపాటు శాసనసభ్యులు, ఎమ్మెల్సీలు పాల్గొంటారని వివరించారు. సినీనటులు ఖుష్బూ, మీనాక్షి చౌదరి, సాయిదుర్గా తేజ కూడా పాల్గొంటారని తెలిపారు.

## మావోయిస్టులకు సహకరించినట్లు ఆధారాలేంటి?

- వారిపై కేసులేం నమోదు కాలేదు కదా..!
- ఫోన్ల అక్రమ ట్యాపింగ్‌పై ప్రభాకర్‌రావుకు సిట్ ప్రశ్నలు



**హైదరాబాద్:** ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావును ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విడతలవారీగా విచారిస్తోంది. ఇప్పటికే మూడు విడతలుగా విచారించగా.. గురు వారం నాలుగోసారి సుదీర్ఘంగా మాట్లాడింది. ఉదయం 11 గంటల సమయంలో సిట్ కా ర్యాలయానికి చేరుకున్న ఆయన్ను ఎనిమి దిన్నర గంటలకుపైగా ప్రశ్నించింది. 2023 శాసనసభ ఎన్నికలకు ముందు రాజకీయ నేతలు, ఐఏఎస్‌లు, వ్యాపారవేత్తలు, జర్నలిస్టు లకు సంబంధించి వందల సంఖ్యలో ఫోన్లపై నిఘా ఉంచడానికి గల కారణాలపై మరోసారి ఆరా తీసింది. మావోయిస్టులకు సహకరిస్తున్నారనే కారణాన్ని చూపి లీగల్ ఇంటర్‌సెప్షన్(ఎల్‌ఐ)కి అనుమతి తీసుకోవడంపై కీలక ప్రశ్నలు వేసింది. ఈ కారణం చూపే తమ నుంచి అనుమతులు తీసుకున్నారని హెూంశాఖ అప్పటి ముఖ్య కార్యదర్శి డా.జితేందర్, నాటి ఇంటెలిజెన్స్ చీఫ్ అనిల్‌కుమార్ లిఖితపూర్వక వాంగ్మూలాలు ఇవ్వడంతో సిట్ దీనిపైనే ప్రశ్నలడిగినట్లు సమాచారం. "మీ బృందం ఎవరిపైన అయితే నిఘా పెట్టిందో వారు మావోయిస్టులకు సహకరించారనేలా ఏమైనా ఆధారాలున్నాయా? రోజుల వ్యవధిలోనే వందల సంఖ్యలో నేతలు, జర్నలిస్టులు కూడబలుక్కుని మావోయిస్టులకు సహకరించారని ఎలా భావించారు? ఒకవేళ మావోయిస్టులకు సహకరించడమే నిజమైతే అందుకు సంబంధించి శాంతిభద్రతల ఠాణాల్లో కేసులెందుకు నమోదు కాలేదు" అని ప్రశ్నించినట్లు తెలిసింది. వీటికి సమాధానాలు చెప్పడంలో ప్రభాకర్‌రావు విఫలమైనట్లు సమాచారం. దర్యాప్తునకు ఆయన సరిగ్గా సహకరించడం లేదనే భావనకు సిట్ వచ్చినట్లు కనిపిస్తోంది. తప్పుడు సమాధానాలు చెబుతున్నారని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ముందు కూడా ఆయన ఇదే తరహాలో సమాధానాలు దాటవేస్తే దర్యాప్తునకు సహకరించడం లేదనే విషయాన్ని సిట్.. సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లే అవకాశం కనిపిస్తోంది. విచారణ క్రమంలో 'ఎమ్మెల్యేలకు ఎర'కు సంబంధించి సైతం ఆయన్ను ప్రశ్నించినట్లు సమాచారం. విచారణ ముగిసిన అనంతరం రాత్రి సుమారు ఏడున్నర గంటల సమయంలో ప్రభాకర్‌రావు తిరిగి వెళ్లిపోయారు. శుక్రవారం ఆయన్ని సిట్ మరోసారి విచారణకు రమ్మంది.

# బనకచర్లను అడ్డుకోండి

(మొదటిపేజీ తరువాయి)

చేపడుతున్నామంటున్న ఏపీ ప్రభుత్వ వాదన అభ్యంతరకరం. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని బనకచర్ల ప్రాజెక్టు విషయంలో ముందుకెళ్లకుండా చూడాలి. దాని ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టును తిరస్కరించాలి. సీడబ్ల్యూసీ సాంకేతిక సలహామండలి అనుమతులు పొందకుండానే వరదజలాల పేరుతో పోలవరం కింద పురుషోత్తపట్నం, వెంకటనగరం, పట్టిసీమ, చింతలపూడి ఎత్తిపోతల పథకాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టింది. గోదావరి ట్రైబ్యునల్ తీర్పునకు అతీతంగా పోలవరం డిజైన్లను మార్చింది. పర్యావరణ అనుమతులకు విరుద్ధంగా పనులు చేపడుతోంది. మేం అభ్యంతరాలు లేవనెత్తినా పనులు మాత్రం కొనసాగిస్తూనే ఉంది. జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరంలో నిబంధనల ఉల్లంఘన జరగకుండా కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాలి" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కేంద్రమంత్రి పాటిల్‌కు వివరించారు. అనంతరం ఆ చర్చల సారాంశాన్ని సీఎం సమక్షంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విలేకర్లకు వెల్లడించారు. "గోదావరి–బనకచర్ల ప్రాజెక్టు గురించి మాకున్న ఆందోళనను కేంద్ర మంత్రి సీఆర్‌పాటిల్‌కు సుదీర్ఘంగా వివరించాం. ఇది గోదావరి జల వివాద ట్రైబ్యునల్–1980కి, ఏపీ పునర్విభజన చట్టం–2014కి వ్యతిరేకం అని చెప్పాం. ఈ ప్రాజెక్టుకు అనుమతుల విషయంలో కేంద్ర ఆర్థిక, పర్యావరణశాఖలు వేగంగా అడుగులు వేయడం తెలంగాణ ప్రజలు, రైతాంగంలో ఆందోళన రేకెత్తిస్తోందన్న విషయాన్ని కేంద్రమంత్రికి వివరించాం. తప్పనిసరిగా మా ఆందోళనలు, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్నాకే.. తదుపరి అడుగు వేస్తామని ఆయన చెప్పారు. ఇప్పటివరకూ బనకచర్ల ప్రాజెక్టు డీపీఆర్ తమకు అందలేదని వాళ్లు స్పష్టం చేశారు" అని ఉత్తమ్ వివరించారు.

### తెలంగాణ 1,500 టీఎంసీలు వాడుకోవడానికి అనుమతిస్తే ఓకే

"తెలంగాణలో 1.50 కోట్ల ఎకరాలకు నీరందించేలా గోదావరిలో 1,000, కృష్ణాలో 500 కలిపి.. 1,500 టీఎంసీలు ఉపయోగించుకోవడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) ఇచ్చి, దానికి కేంద్రం కూడా ఆమోదం తెలిపితే.. ఏపీ బనకచర్ల సహా ఏ ప్రాజెక్టులు నిర్మించుకున్నా తెలంగాణకు అభ్యంతరం లేదని కేంద్రమంత్రికి చెప్పాం. పోలవరం–బనకచర్ల లింక్ ద్వారా కాకుండా.. ఇచ్చంపల్లి–నాగార్జునసాగర్ అనుసంధానం ద్వారా పెన్నా పరీవాహక ప్రాంతానికి ఏపీ సర్కారు నీరు తీసుకెళ్లాలనుకుంటే దానిపై చర్చించడానికి మేం సిద్ధం అని తెలిపాం. ఈ రెండు ప్రతిపాదనలనూ పక్కన పెట్టి బనకచర్లపై ముందుకెళ్లడం చట్టవిరుద్ధమవుతుంది కాబట్టి దాన్ని నిలువరించాలని కోరాం. అందుకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందిస్తూ.. అతి త్వరలో ఇరు రాష్ట్రాల సీఎంల సమావేశం ఏర్పాటు చేసి అన్ని విషయాలూ చర్చిస్తామని హామీ ఇచ్చారు. కేంద్రమంత్రితో చర్చలు గంటసేపు మంచి వాతావరణంలో జరిగాయి. తెలంగాణకు అన్యాయం చేయబోమని, తప్పనిసరిగా రాష్ట్ర ప్రయోజనాలను కాపాడతామని సీఆర్ పాటిల్ స్పష్టం చేశారు.

### కృష్ణా ట్రైబ్యునల్ తీర్పు వెంటనే వెలువడేలా చూడండి

కృష్ణా జలవివాద ట్రైబ్యునల్–2 తీర్పు త్వరగా వెలువడేలా చూడాలని కేంద్రమంత్రిని కోరాం. ఇంత సుదీర్ఘంగా అనిశ్చిత పరిస్థితి కొనసాగించడం మంచిది కాదని, ట్రైబ్యునల్ త్వరగా తన పనిముగించేలా చూడాలని కోరాం" అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వివరించారు. కేంద్రం నుంచి సరైన స్పందన లేకపోతే కోర్టుకు వెళ్తారా?.. అన్న ప్రశ్నకు బదులిస్తూ.. "తెలంగాణ ప్రయోజనాలను కాపాడటంలో మేం వెనుకాముందూ ఆలోచించం. రాష్ట్ర ప్రయోజనాలే మాకు సర్వోత్కృష్టం. న్యాయం జరగకుంటే దీనిపై సుప్రీంకోర్టుకు వెళ్లడానికి వెనుకాడం" అని ఉత్తమ్ స్పష్టం చేశారు.

### వెంటనే జలాలు, నిధులు కేటాయించండి

ఇదే సమయంలో తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులు సత్వరం ఇవ్వాలని విజ్ఞప్తి చేశాం. రాష్ట్రంలో మేం అనేక ప్రాజెక్టులు వేగంగా నిర్మించాలనుకుంటున్నాం. కానీ అనుమతుల కోసం మేం చేసిన దరఖాస్తులను చాలా నిదానంగా, ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదనలపై వేగంగా నిర్ణయం తీసుకొనే ప్రక్రియ కొనసాగుతున్నట్లుగా భావిస్తున్నా మని కేంద్రమంత్రికి చెప్పాం. ఇలాంటి చర్యల ద్వారా రెండు రాష్ట్రాల మధ్య ఇబ్బందికర పరిస్థితులు తీసుకురావొద్దని కోరాం. పాలమూరు–రంగారెడ్డి, సమ్మక్క–సారక్క, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు వెంటనే చేయాలని అడిగాం. గంగ, యమునా నదుల ప్రక్షాళనకు నిధులిచ్చినట్లుగానే మూసీ నది పునరుజ్జీవ కార్యక్రమానికి సాయం చేయాలని ముఖ్యమంత్రి కేంద్రాన్ని కోరారు.

## బనకచర్లకు పచ్చజెండా ఊపింది రేవంతే

- రాష్ట్ర హక్కులు బాబుకు రాసిస్తే.. ప్రజలు ఊరుకోరు
- అర్థం లేని వ్యాఖ్యలు చేస్తున్న సీఎంను ఉరి తీసినా తప్పులేదు
- కేసీఆర్ హయాంలో ఎపెక్స్ కౌన్సిల్‌లో బనకచర్లపై చర్చే జరగలేదు
- ఏటా 3 వేల టీఎంసీలు సముద్రంలోకి వృథాగా పోతున్నాయని చెప్పింది సీడబ్ల్యూసీనే
- వాటిలో 1,950 టీఎంసీలు తెలంగాణకు కేటాయించాలని కేసీఆర్ డిమాండ్ చేశారు : మాజీ మంత్రి హరీశ్‌రావు




**హైదరాబాద్:** తెలంగాణ నీళ్ల విషయంలో రాజీపడి.. బనకచర్లకు పచ్చజెండా ఊపింది రేవంత్‌రెడ్డే అని భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. చంద్రబాబుకు ఆయన దాసోహం అవుతున్నారని, ఇది తెలంగాణకు ద్రోహం చేయడమేనని ధ్వజమెత్తారు. రాష్ట్ర హక్కులను చంద్రబాబుకు, ఏపీకి రాసిస్తానంటే తెలంగాణ ప్రజలు ఊరుకోరని, అయినా తెలంగాణ నీటి వినియోగానికి అనుమతిచ్చేందుకు చంద్రబాబు ఎవరని, ఆయనకేం హక్కుందని హరీశ్‌రావు నిలదీశారు. హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "బనకచర్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తట్టిలేపిందే భారాస. 968 టీఎంసీల వినియోగానికి తెలంగాణలో రూపకల్పన జరిగింది. అందులో 946 టీఎంసీలకు సీడబ్ల్యూసీ, హైడ్రాలజీ క్లియరెన్సులు వచ్చాయి. ఇవి కాకుండా.. సముద్రంలో కలుస్తున్న 3 వేల టీఎంసీల్లో తెలంగాణ వాటా కింద 1,950 టీఎంసీలు కేటాయించాలని కేసీఆర్ డిమాండ్ చేశారు. కృష్ణాలోనూ 763 టీఎంసీలు తెలంగాణకు రావాలని బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్ ముందు వాదనలు వినిపించింది భారాస ప్రభుత్వమే. గోదావరిలో 1,000 టీఎంసీలు, కృష్ణాలో 500 టీఎంసీలు వాడుకునేందుకు తెలంగాణకు అనుమతిస్తే చాలని ఏపీ సీఎం చంద్రబాబును రేవంత్‌రెడ్డి కోరుతున్నారు. ఏపీ ఎన్ని ప్రాజెక్టులు కట్టుకున్నా అభ్యంతరం లేదంటున్నారు. ఇది తెలంగాణకు ద్రోహం చేయడమే. ఒక పక్క కృష్ణాలో 763 టీఎంసీలు కేటాయించాలని ట్రైబ్యునల్ ముందు వాదనలు వినిపిస్తుండగా, 500 టీఎంసీలు చాలని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానిస్తే.. మన వాదనలకు విలువ ఉంటుందా?

### ఎపెక్స్ కౌన్సిల్ వివరాల వక్రీకరణ

గోదావరి నుంచి ఏటా కనీసం 3 వేల టీఎంసీల నీళ్లు సముద్రంలో కలుస్తాయంటూ 60 ఏళ్ల లెక్కలను కేంద్ర జల సంఘమే(సీడబ్ల్యూసీ) వెల్లడించింది. ఇదే విషయాన్ని ఎపెక్స్ కౌన్సిల్ సమావేశంలో కేసీఆర్ చెప్పారు. ఈ నీటిని ఎలా ఉపయోగించుకోవాలనే అంశంపై ఇరు రాష్ట్రాలు కూర్చొని మాట్లాడుకోవాలని, రెండు రాష్ట్రాలకూ ప్రయోజనం చేకూరేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. అసలు బనకచర్లపై ఆనాడు చర్చే జరగలేదు. ఆనాటి సమావేశంలో కేసీఆర్ మరో విషయాన్నీ స్పష్టం చేశారు. గోదావరి–కృష్ణా నదుల అనుసంధానం విషయంలో తెలంగాణను సంప్రదించకుండా.. ఎట్టి పరిస్థితుల్లోనూ ముందుకెళ్లకూడదని, ఒకవేళ వెళ్తే అందుకు తెలంగాణ అంగీకరించదనీ ఆయన కుండబద్దలు కొట్టారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దాచిపెట్టి, వాస్తవాలను వక్రీకరించారు. ఏ ప్రాజెక్టు ఏ బేసిన్ పరిధిలో ఉంటుందో ఆయనకు కనీస అవగాహన లేదని నిన్నటి పవర్ పాయింట్ ప్రజంటేషన్‌లో తెలిసిపోయింది. కేసీఆర్, జగన్‌ల మధ్య సమావేశాల గురించీ రేవంత్ అబద్ధాలు చెప్పారు. ఆ ఎజెండా ఉంటే బయటపెట్టాలి. బేసిన్ వెంట నీళ్లు తేవాలని అప్పుడు అనుకున్నారు. దానివల్ల నాగార్జునసాగర్, శ్రీశైలం పరిధిలో నీళ్లు వస్తాయని కేసీఆర్ ప్రతిపాదించారు. దానికి జగన్ ఒప్పుకోలేదు. దీంతో అది ముందుకుపోలేదు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే శ్రీశైలం రైట్ బ్యాంక్ కెనాల్ లైనింగ్ పనులు ప్రారంభమయ్యాయి. దాన్ని నిలువరించాల్సిన బాధ్యత రేవంత్‌రెడ్డిపై ఉంది. దానిపై ఎందుకు స్పందించరు" అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

## జీసీసీ విధానంలో ఎలక్ట్రిక్ బస్సులు

- నెలాఖరులో 'పీఎం ఈ-డ్రైవ్' టెండర్లు
- సుమారు ఐదు వేల మంది ఆర్టీసీ డ్రైవర్లపై ప్రభావం
- సర్దుబాటు దిశగా సంస్థ దృష్టి




**హైదరాబాద్:** వెట్ గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్(జీసీసీ) విధానంలో ఎలక్ట్రిక్ బస్సుల్ని తీసుకునేందుకు ఆర్టీసీ సిద్ధమవుతోంది. ఈ మేరకు 2 వేల బస్సులు దశలవారీగా అందుబాటులోకి రానున్నాయి. వీటిని సరఫరా చేసే సంస్థ ఏది? కిలోమీటర్ల వారీగా అద్దె ఎంతనే వివరాలపై కొద్దిరోజుల్లో స్పష్టత రానుంది. ఈ నెలాఖరులో టెండర్ల ప్రక్రియ కొలిక్కి వస్తుందని ఆర్టీసీ వర్గాల సమాచారం. దేశంలో ఎలక్ట్రిక్ బస్సుల వాడకాన్ని ప్రోత్సహించేందుకు కేంద్రం 'ప్రధానమంత్రి ఈ-డ్రైవ్' పథకాన్ని తెచ్చింది. ప్రధాన నగరాల్లో 14,028 ఎలక్ట్రిక్ బస్సుల్ని అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. టీజీఎస్‌ఆర్టీసీ 2,800 బస్సులు కావాలని కోరగా కేంద్ర ప్రభుత్వం 2 వేలకు ఆమోదం తెలిపింది.

### ఫలించని డ్రై జీసీసీ ప్రయత్నాలు

'డ్రై జీసీసీ' విధానం కోసం ఆర్టీసీ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఇందులో ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీ డ్రైవర్లతో నడిపించవచ్చు. ఇటు కేంద్ర పరిశ్రమల శాఖ.. అటు బస్సుల తయారీ సంస్థ ఈ విధానానికి ఆసక్తి కనబర్చలేదు. దీంతో 'వెట్ జీసీసీ' విధానంలోనే బస్సులను తీసుకోవాల్సిన పరిస్థితి. ఇందులో గుత్తేదారు బస్సులతో పాటు డ్రైవర్లు, నిర్వహణ సిబ్బందిని కూడా సమకూర్చుతారు. దీంతో ఆర్టీసీ డ్రైవర్లపై ప్రభావం పడనుంది.

### మిగులు డ్రైవర్లు కండక్టర్లుగా

హైదరాబాద్‌లో వాయు కాలుష్య నియంత్రణలో భాగంగా మొత్తం ఎలక్ట్రిక్ బస్సులు నడిపించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా ఇక్కడి డీజిల్ బస్సుల్ని జిల్లాలకు పంపించాలని ప్రణాళికలు రూపొందించింది. ఆర్టీసీలో ఒక్కో బస్సుకు సగటున 2.5 మంది డ్రైవర్లు ఉన్నారు. 2 వేల కొత్త ఎలక్ట్రిక్ బస్సుల రాకతో 'గ్రేటర్ హైదరాబాద్' జోన్‌లో దాదాపు 5 వేల మంది డ్రైవర్లు మిగులుతారని అంచనా. వీరి సర్దుబాటుకు పలు ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తున్నారు. సంస్థలో 829 మంది కండక్టర్ల కొరత ఉంది. రానున్న నెలల్లో ఉద్యోగ విరమణలతో ఈ సంఖ్య మరింత పెరగనుంది. ఈ నేపథ్యంలో మిగులు డ్రైవర్లలో కొందరిని ఎలక్ట్రిక్ బస్సుల్లో కండక్టర్లుగా తీసుకోవాలన్న యోచనలో ఆర్టీసీ ఉంది. మరికొందరికి ఇతర విభాగాల్లో అవకాశం కల్పించడం, జిల్లాలకు పంపడం వంటి ప్రతిపాదనలు ఉన్నట్లు ఆర్టీసీ అధికారి ఒకరు తెలిపారు.

## మెట్రో ఫేజ్-2 మంజూరు చేయండి

- కేంద్ర మంత్రి ఖట్టర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి వినతి
- బ్రిటన్ మాజీ ప్రధాని బ్లెయిర్‌తో ముఖ్యమంత్రి భేటీ
- 'తెలంగాణ రైజింగ్ విజన్'పై బ్లెయిర్ సంస్థతో ఎంవోయూ



**దిల్లీ:** హైదరాబాద్ మెట్రో ఫేజ్–2 ప్రాజెక్టుకు సత్వరమే అనుమతి మంజూరు చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు విజ్ఞప్తి చేశారు. సీఎం గురువారం ఇక్కడ కేంద్రమంత్రిని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. "వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలో 76.4 కిలోమీటర్ల పొడవైన మెట్రో రెండోదశ అవసరం చాలా ఉంది. రూ.26,269 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వంతో కలిసి ఉమ్మడిగా చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఇది కార్యరూపం దాలిస్తే నగరంలో రాకపోకలు వేగంగా సాగుతాయి. రహదారులపై రద్దీ తగ్గుతుంది. పర్యావరణ, సుస్థిరాభివృద్ధికి ఇది ఎంతో దోహదం చేస్తుంది. కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ సూచనల మేరకు డీపీఆర్‌లో అవసరమైన సవరణలు చేసి సమర్పించాం. ఈ ప్రాజెక్టుకున్న అత్యవసరతను దృష్టిలో ఉంచుకొని ఇతర శాఖల నుంచీ అవసరమైన అనుమతులు ఇప్పించండి" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రికి విన్నవించారు.

### 'తెలంగాణ రైజింగ్'కు టోనీ బ్లెయిర్ అభినందన

సీఎం రేవంత్‌రెడ్డి తన దిల్లీ పర్యటనలో యునైటెడ్ కింగ్‌డమ్ మాజీ ప్రధానమంత్రి టోనీబ్లెయిర్‌తో భేటీ అయ్యారు. 1997–2007 మధ్య యూకే ప్రధానిగా పనిచేసిన అనంతరం రాజకీయాల నుంచి వైదొలగిన బ్లెయిర్.. టోనీబ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ ఛేంజ్ (టీబీఐజీసీ)ను స్థాపించారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల నాయకులకు విజన్, వ్యూహాల రచన, వాటి అమలులో సహకరించడం దీని లక్ష్యం. ఇలా భారత్‌లోని వివిధ రాష్ట్ర ప్రభుత్వాలకు సహకరించడానికి బ్లెయిర్ దిల్లీకి వచ్చిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆయనతో భేటీ అయ్యారు. సుమారు గంటపాటు జరిగిన ఈ సమావేశంలో.. 'తెలంగాణ రైజింగ్ 2047' లక్ష్యంలోని కీలకాంశాలను బ్లెయిర్‌కి ముఖ్యమంత్రి వివరించారు. ఈ విధానపత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వ రెండో వార్షికోత్సవమైన డిసెంబరు 9న విడుదల చేయబోతున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యాల గురించి వివరించారు. రైతులు, యువత, మహిళల ఆర్థికాభివృద్ధితో పాటు, మానవాభివృద్ధి సూచికలను మెరుగుపరిచేందుకు తీసుకుంటున్న చర్యల గురించి చెప్పారు. రాష్ట్రాన్ని పట్టణ, శివారు, గ్రామీణ జోన్లుగా విభజించి సూక్ష్మప్రణాళికలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టబోతున్నట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికలను బ్లెయిర్ అభినందించారు. భారత్ ఫ్యూచర్‌సిటీ, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీల గురించి ఆయన ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. 'తెలంగాణ రైజింగ్ విజన్' రూపకల్పనతో పాటు, దాని అమలులో పాలుపంచుకోవడానికి టీబీఐజీసీ, తెలంగాణ ప్రభుత్వం అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈ సమావేశాల్లో రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంపీలు మల్లురవి, రఘువీర్‌రెడ్డి, దిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్‌రెడ్డి, రాష్ట్ర పారిశ్రామిక పెట్టుబడుల విభాగం సీఈఓ జయేశ్‌రంజన్, పారిశ్రామిక, వాణిజ్య విభాగం ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, మెట్రో ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి, కేంద్ర ప్రాయోజిత ప్రాజెక్టుల సమన్వయ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, టీబీఐజీసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## బల్కంపేట ఎల్లమ్మ ఆలయానికి నీతా అంబానీ రూ.కోటి విరాళం



**హైదరాబాద్:** బల్కంపేట ఎల్లమ్మ, పోచమ్మ దేవస్థానానికి రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ సతీమణి నీతా అంబానీ రూ.కోటి విరాళం అందజేశారు. ఈ మొత్తం బుధవారం దేవస్థానం బ్యాంకు ఖాతాలో జమైంది. ఈ ఏడాది ఏప్రిల్ 23న నీతా అంబానీ తల్లి పూర్ణిమ దలాల్, సోదరి మమతా దలాల్ దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి ఆలయ ఈవో కృష్ణ వారికి ఆలయ విశిష్టతను వివరించి.. దేవస్థానం అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. ఈ క్రమంలో ఆలయానికి నీతా అంబానీ రూ.కోటి విరాళాన్ని అందజేశారు. ఈ మొత్తాన్ని బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి వచ్చే వడ్డీని నిత్యాన్నదానం కోసం వినియోగిస్తామని ఆలయ ఇన్‌ఛార్జి ఈవో మహేందర్‌గౌడ్ తెలిపారు.

# పేదల కలలు నెరవేర్చడమే లక్ష్యం

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- వాసాలమర్రిలో ఇళ్ల పట్టాల పంపిణీ




**తుర్కపల్లి :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పేదల కలలు నెరవేర్చడమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దత్తత గ్రామమైన యాదాద్రి భువనగిరి జిల్లా వాసాలమర్రిలో గురువారం ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో నిరుపేదలకు 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు చెప్పారు. మొదటి విడతగా 4.5 లక్షల ఇళ్లు కట్టించాలని నిర్ణయించామని తెలిపారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పాలనలో 24 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించినట్లు పేర్కొన్నారు. ఆగస్టు 15 నాటికి భూభారతి చట్టం ద్వారా భూ సమస్యలన్నింటినీ పరిష్కరించనున్నట్లు చెప్పారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా సర్వేయర్లను ప్రభుత్వం నియమించనుందని పేర్కొన్నారు.

### వాసాలమర్రిని కేసీఆర్ ఆగం చేశారు...

మాజీ సీఎం కేసీఆర్ దత్తత పేరుతో మాయమాటలు చెప్పి తన స్వార్థం కోసం ఫాంహౌస్‌కు వెళ్లేందుకు వీలుగా వాసాలమర్రిలో ఇళ్లు కూల్చి.. విశాలమైన రోడ్డు వేసుకున్నారని, గ్రామస్థులను ఆగం చేశారని మంత్రి ధ్వజమెత్తారు. ఆదర్శంగా తీర్చిదిద్దుతానని చెప్పి... ఒక్క ఇల్లు కూడా కట్టకుండా ప్రజలను మోసం చేశారని విమర్శించారు. గ్రామానికి 227 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. వాసాలమర్రి వాసులతో సమావేశమైన సందర్భంగా గ్రామానికి చెందిన ఆకుల ఆగమ్మను అన్నివిధాలా ఆదుకుంటానని గతంలో సీఎంగా ఉన్నప్పుడు కేసీఆర్ మాట ఇచ్చారని, దాన్ని నెరవేర్చలేదని మంత్రి విమర్శించారు. ఆగమ్మకు మంత్రి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఇందిరమ్మ ఇంటి పట్టా అందజేశారు. అయిలయ్య రూ.లక్ష సాయం అందించారు. కార్యక్రమంలో ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మహిళా సహకార అభివృద్ధి సంస్థ ఛైర్‌పర్సన్ బండ్రు శోభారాణి, ఆలేరు మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ చైతన్య, కలెక్టర్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాలకు 381 డ్రోన్లు పంపిణీ చేస్తాం : మంత్రి తుమ్మల



**హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వ పథకం నమో డ్రోన్ దీదీ కింద సరఫరా అయ్యే 381 డ్రోన్లను మహిళాసంఘాలకు అందిస్తామని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గురువారం సచివాలయంలో ఆయన తమ శాఖపై సమీక్ష నిర్వహించారు. "రాష్ట్రంలో జులై వరకు సరిపడా ఎరువుల నిల్వలు ఉన్నాయి. ఆగస్టు మాసానికి అవసరమైన ఎరువులను తెప్పించాలి. రాష్ట్రం ఏర్పడిన తరువాత ఎన్నడూ లేని విధంగా ఈ సారి 1,55,257 టన్నుల జొన్నలను మార్క్‌ఫెడ్ ద్వారా కొన్నాం. పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధరలు నిర్దేశించే వ్యవసాయ ఖర్చులు, ధరల కమిషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం తరఫున నివేదిక ఇస్తాం" అని చెప్పారు.

### నెదర్లాండ్స్ కంపెనీ ప్రతినిధులతో భేటీ

వ్యవసాయ రంగంలో కృత్రిమ మేధ వినియోగానికి సహకరిస్తామని నెదర్లాండ్స్‌కు చెందిన ఏఆర్ఐక్యూటీ సంస్థ ముందుకొచ్చింది. సంస్థ ప్రతినిధులు గాల్లి వినయ్, నడింపల్లి అనిరుధ్‌లు మంత్రి తుమ్మలను సచివాలయంలో కలిసి వ్యవసాయంలో ఏఐ వినియోగ ప్రాజెక్టు గురించి వివరించారు. ప్రతిపాదనలు ఇవ్వాలని మంత్రి వారికి సూచించారు.




## దోస్త్ మూడో విడత రిజిస్ట్రేషన్లు, వెబ్ ఆప్షన్ల గడువు పెంపు

**హైదరాబాద్:** డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్-తెలంగాణ(దోస్త్) ద్వారా డిగ్రీ ప్రవేశాలను మూడు విడతలుగా చేపట్టనున్నారు. దోస్త్ మూడో విడత రిజిస్ట్రేషన్లకు గడువును ఈనెల 25 వరకు పొడిగించినట్టు ఉన్నత విద్యామండలి తెలిపింది. ఈనెల 25 వరకు రిజిస్ట్రేషన్లు, ఆన్‌లైన్ వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. విద్యార్థులు, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపల్స్ అభ్యర్థన మేరకు గడువు పొడిగించినట్టు ఉన్నత విద్యామండలి తెలిపింది.

## చిన్నారుల అశ్లీల దృశ్యాలతో వీడియోలు

- 15 మంది అరెస్ట్
- రాష్ట్రవ్యాప్తంగా టీజీసీఎస్‌బీ ఆపరేషన్

**హైదరాబాద్:** చిన్నారుల అశ్లీల దృశ్యాలతో కూడిన వీడియోల సర్క్యులేషన్‌ను నియంత్రించేందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) ఈనెల 18న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో 15 మందిని అరెస్ట్ చేసింది. వీరంతా ఆన్‌లైన్‌లో చిన్నారుల అశ్లీల దృశ్యాలను తరచుగా సర్క్యులేట్ చేస్తున్నట్లు గుర్తించారు. టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయెల్ గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. నేషనల్ సైబర్‌క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో నమోదయ్యే ఫిర్యాదులతో పాటు.. 'నేషనల్ సెంటర్ ఫర్ మిస్సింగ్ అండ్ ఎక్స్‌ప్లాయిటెడ్ చిల్డ్రన్' నుంచి వచ్చిన సైబర్ టిప్‌లైన్స్ ఆధారంగా ఈ ఆపరేషన్ చేపట్టారు. చిన్నారుల అశ్లీల దృశ్యాలను అప్‌లోడ్ చేయడం.. ఎలక్ట్రానిక్ ఉపకరణాల్లో స్టోర్‌చేయడం.. సర్క్యులేట్ చేయడం లాంటి నిషేధితచర్యలకు పాల్పడుతున్న రిపీటెడ్ అఫెండర్లపై టీజీసీఎస్‌బీలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ (సీపీయూ) ఆధ్వర్యంలో ఈ ఆపరేషన్ చేపట్టారు. మొత్తం 57 సైబర్ టిప్‌లైన్లకు సంబంధించి ఫిర్యాదులు రాగా.. వాటికి కారకులైన 15 మందిని గుర్తించి 34 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. వారిపై ఐటీ, పోక్సో చట్టాల్లోని రెండు సెక్షన్లు ప్రయోగించారు. 17 కేసులు టీజీసీఎస్‌బీ హెడ్‌క్వార్టర్ ఠాణాలోను.. మిగిలిన కేసులు హైదరాబాద్, యాదగిరిగుట్ట, కరీంనగర్, వరంగల్, జగిత్యాల, జగద్గిరిగుట్టల్లోను నమోదు చేశారు. ఆ వీడియోల్లో 90శాతం బాలికలున్నట్లు, ఎక్కువమంది విదేశీ చిన్నారులుగా గుర్తించారు. ఆ వీడియోలను ఎక్కడ రూపొందించారు.. క్రయవిక్రయాలు ఎలా జరిగాయి.. వాటిని సర్క్యులేట్ చేయడంలో నిందితుల పాత్ర.. బాధిత చిన్నారులు ఎవరు.. వంటి అంశాలను ఛేదించే ప్రయత్నాల్లో టీజీసీఎస్‌బీ నిమగ్నమైంది. నిందితుల్లో 15 నుంచి 50 ఏళ్లవారే ఎక్కువగా ఉన్నట్లు తేలింది. వారిలో గతంలో ఐఐటీలో చదివి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న యువకుడితోపాటు ఓ బీటెక్ విద్యార్థి ఉండటం గమనార్హం.

## బ్రిడ్జి గుంతలో పడ్డ కారు.. ఇద్దరు మృతి

**కామారెడ్డి, జూన్ 19 :** ఎల్లారెడ్డి మండలం లోని మల్లయ్యపల్లి గ్రామ శివారులో నేషనల్ హైవే నిర్మాణంలో భాగంగా పోచారం కాలువపై నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జి గుంతలో బుధవారం రాత్రి ప్రమాదవశాత్తు కారు పడడంతో ఇద్దరు మృతి చెందారు. ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పాపన్నపేట మండలం నర్సింగ్ రావు పల్లి తండాకు చెందిన పీరియ (38), డ్రైవర్, పీరియా (32) ప్రమాదంలో అక్కడికక్కడే మృత్యుపాలయ్యారు. సోను, వెన్ను, ప్రవీణ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వీరి ముగ్గురు పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. నర్సింగరావుపల్లి నుంచి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు, డ్రైవర్‌తో కలిసిపెద్దగుట్టకు బుధవారం రాత్రి బయలుదేరారు. నేషనల్ హైవే రోడ్డు నిర్మాణంలో భాగంగా సదరు కాంట్రాక్టర్ పోచారం కాల్వపై బ్రిడ్జిలు నిర్మిస్తున్నారు. వాహనాల రాకపోకలకు కాలువలో మట్టిని పోసి దారిని చేశారు. కాగా కారు ప్రమాదవశాత్తు పైనుంచి పది ఫీట్లకు పైగా ఉన్న గుంతలో వెల్లకిలో పడింది. కారు కిందపడడంతోనే పై టాప్ ఒత్తుకపోవడంతో అక్కడికక్కడే ఇద్దరు మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన ముగ్గురిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# ఫీజులపై ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం

- ఇంజినీరింగ్ కళాశాలలను గ్రేడ్లుగా విభజించే యోచన
- అవసరమైతే టీఏఎఫ్ఆర్‌సీ చట్ట సవరణ!




**హైదరాబాద్:** రాష్ట్రంలో ఇంజినీరింగ్ కళాశాలలకు కొత్త ఫీజులను నిర్ణయించే ముందు ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం చేయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఐఏఎస్, ఇతర అధికారులతో కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించిన సర్కారు... ఒకట్రెండు రోజుల్లో ఉత్తర్వులు జారీ చేయనుంది. అనంతరం తమిళనాడు, కేరళ, కర్ణాటక తదితర ఆరేడు రాష్ట్రాలకు బృందాలను పంపనుంది. అక్కడ ఫీజులు ఎలా ఉన్నాయి.. రుసుముల నిర్ధారణకు ప్రాతిపదిక ఏమిటి.. కళాశాలల్లో విద్యా నాణ్యత ఎలా ఉంది.. తదితర అంశాలను ఈ బృందాలు పరిశీలిస్తాయి. ఒక్కో బృందం ఒక్కో రాష్ట్రంలో పర్యటించి నివేదిక అందజేయనుందని సమాచారం. భారీ ఫీజులపై సీఎం రేవంత్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తంచేస్తూ లోతుగా అధ్యయనం చేయాలని ఆదేశించిన నేపథ్యంలో అధికారులు ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం చేయనున్నారు.

### తనిఖీలపై తలోమాట..

తెలంగాణ ప్రవేశాలు, రుసుముల నియంత్రణ కమిటీ(టీఏఎఫ్ఆర్‌సీ) ఇప్పటివరకు కేవలం ఆయా కళాశాలలు అందజేసిన ఆదాయ, వ్యయాల ఆడిట్ నివేదికల ఆధారంగా మూడేళ్లకు ఒకసారి ఫీజులను ఖరారు చేస్తోంది. ఆయా కళాశాలలు విద్యార్థుల కోసం ఖర్చు చేయకున్నా...దొంగ బిల్లులు పెట్టినా... దానిపై ఆడిటర్లు ఆమోదముద్ర వేస్తే చాలు... ఆ లెక్కల ఆధారంగానే ఫీజులను నిర్ణయిస్తోంది. ఆ కళాశాలలు చెప్పిన లెక్కలన్నీ వాస్తవమా కాదా అనే విషయాన్ని పరిశీలించడంలేదు. ఆయా కళాశాలలను తనిఖీ చేసే అధికారం తమ చట్టంలో లేదని టీఏఎఫ్ఆర్‌సీ వర్గాలు తరచూ వ్యాఖ్యానిస్తుంటాయి. ఫీజుల నిర్ధారణ కమిటీలో జేఎన్‌టీయూహెచ్, ఓయూ తదితర వర్సిటీల నుంచి ప్రతినిధులు ఉంటారని, తాము ఒక కళాశాలకు ఫీజు ఖరారు చేస్తున్నప్పుడు అందులో కనీస సౌకర్యాలు లేవని, జీతాలు సరిగా ఇవ్వరనే విషయాన్ని ఎందుకు ప్రస్తావించరని టీఏఎఫ్ఆర్‌సీ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. అయితే టీఏఎఫ్ఆర్‌సీకి అన్ని అధికారాలు ఉంటాయని, కేరళలో కూడా స్వయంగా కొన్ని కళాశాలలను తనిఖీ చేస్తారని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఒకవేళ అధికారం లేకుంటే అవసరమైతే చట్టంలో మార్పు చేయాలని భావిస్తున్నారు.

### ఈ కసరత్తు భారం పెంచడానికి కాదు...

అన్ని ఇంజినీరింగ్ కళాశాలలకు ఒకేలా ఫీజుల శాతం పెంచడం సమంజసం కాదని, విద్యా నాణ్యత, ఇతర అంశాల ఆధారంగా గ్రేడ్లుగా విభజించి.. ఆ ప్రకారం ఫీజులు పెంచేలా కొలమానాలను, నిబంధనలను రూపొందించుకోవాలన్న యోచనలో విద్యాశాఖ వర్గాలున్నాయి. ముందుందు ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. 'ఈ కసరత్తు అంతా ఫీజులను పెంచడానికి కాదు... నిబంధనల ప్రకారం నిర్ణయించడానికి మాత్రమే... సాధ్యమైనంత వరకు తగ్గించే ప్రయత్నమే. కొన్ని కళాశాలలకు పెరిగినా అది స్వల్పంగానే ఉంటుంది" అని ఒక అధికారి వ్యాఖ్యానించారు.



## అసమానతలను సరిచేసేదే నిజమైన ప్రజాస్వామ్యం

- భారత రాజ్యాంగం ఓ విప్లవాత్మక సందేశం
- సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ వ్యాఖ్యలు

**దిల్లీ:** సమాజంలో పెద్ద సంఖ్యలో ఉన్న బలహీన వర్గాలను అణచివేసే అసమానతలను సరి చేయకుండా ఏ దేశమూ తనను తాను నిజమైన ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకోజాలదని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బి.ఆర్.గవాయ్ స్పష్టం చేశారు. దీర్ఘకాల స్థిరత్వం, సామాజిక విలీనం, సుస్థిర అభివృద్ధికి.. సామాజిక, ఆర్థిక న్యాయం సాధించడం అవసరమని పేర్కొన్నారు. బుధవారం ఇటలీలోని మిలన్‌లో 'ఒక దేశంలో సామాజిక ఆర్థిక న్యాయం సాధించడంలో రాజ్యాంగం పాత్ర' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. న్యాయం అనేది ఎక్కడి నుంచో తెచ్చిపెట్టిన ఒక ఆదర్శంలా ఉండకూడదని.. స్థానిక సమాజం, అక్కడి ప్రజల పరిస్థితులు, అవకాశాల నుంచి రావాలని పేర్కొన్నారు. ఆర్థిక, సామాజిక న్యాయంపై భారత రాజ్యాంగ రూపకర్తలు ఎంతో స్పృహతో వ్యవహరించారనే విషయాన్ని గర్వంతో చెబుతున్నానని తెలిపారు. ఆర్థిక, సామాజిక న్యాయం అంటే సంపద పంపిణీ, సంక్షేమ పథకాలే కాదని.. ప్రతి వ్యక్తీ గౌరవంతో జీవించేలా చేయడం కూడానని అభిప్రాయపడ్డారు. 'అవకాశాలను ప్రజాస్వామ్య బద్ధం చేయడంతోపాటు కులం, వెలివేతలనే హద్దులను చెరిపేయాలనే రాజ్యాంగ ఆదర్శాలవల్ల భారత దేశంలో బాగా వెనుకబడిన వర్గానికి చెందిన నేను ఈ స్థాయిలో ఉన్నాను. ఇదే విషయాన్ని గతంలోనూ చెప్పాను.. ఇప్పుడూ చెబుతున్నాను. భారత రాజ్యాంగం.. పరిపాలనకు మార్గదర్శకత్వం వహించే ఒక రాజకీయ పత్రమే కాదు.. శతాబ్దాలపాటు పరాయి పాలనలో మగ్గిన.. ఆర్థిక అసమానతలు ఎక్కువగా ఉన్న.. విభజనలు ఉన్న సమాజానికి ఒక నమ్మకం.. విప్లవాత్మకమైన సందేశం.. ఆశాకిరణం' అని సీజేఐ పేర్కొన్నారు.

### రాజ్యాంగ సవరణలు ఎంతవరకు వెళ్లగలవు?

1973లో చరిత్రాత్మక తీర్పు వచ్చిన కేశవానంద భారతి కేసును జస్టిస్ బి.ఆర్.గవాయ్ గుర్తుచేశారు. 'రాజ్యాంగాన్ని సవరించే అధికారం ఎవరిదన్న అంశంలో పార్లమెంటు, న్యాయ వ్యవస్థ మధ్య ఎప్పుడూ ఘర్షణ ఉంటుంది. ఇది ఎప్పుడూ ఒకే అంశం చుట్టూ తిరుగుతుంటుంది. సవరణలు ఎంత దూరం వెళ్లగలవు అనేదే ఆ ప్రశ్న. ఈ ఘర్షణ ఎన్నిసార్లు జరిగినా అది సామాజిక, ఆర్థిక హక్కులను సాధించేందుకేనని గుర్తుంచుకోవడం అవసరం' అని పేర్కొన్నారు. నిందితుల నివాస భవనాలను, ఆస్తులను ప్రభుత్వం కూల్చేసే కేసును ఇటీవల విచారించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ఈ విధానం చట్టబద్ధ పాలనను మీరుతోందని, ప్రాథమిక హక్కును కాలరాస్తోందని సుప్రీంకోర్టు తేల్చి చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు.

# కృష్ణమ్మ జలసిరి

- ఆల్మట్టి, నారాయణపూర్ గేట్ల నుంచి దిగువకు వరద
- జూరాలలోకి 40వేల క్యూసెక్కులు.. 52వేల క్యూసెక్కుల ఔట్‌ఫ్లో
- శ్రీశైలంలోకి 45వేలు, సాగర్‌లోకి 11వేల క్యూసెక్కులు



**హైదరాబాద్, జూన్ 19 :** కృష్ణమ్మ జలసిరిని సంతరించుకుంటోంది. పశ్చిమ కనుమల్లో కురుస్తున్న వర్షాలతో కృష్ణానది పరిధిలోని ప్రాజెక్టుల్లోకి వరద నీరు వస్తోంది. ఆల్మట్టిలోకి 80 వేల క్యూసెక్కుల నీరు వస్తోంది. 27, 967 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. ఆల్మట్టి పూర్తి సామర్థ్యం 129.72 టీఎంసీలు కాగా... ప్రస్తుతం జలాశయంలో 68.55 టీఎంసీల నీరు ఉంది. దిగువన నారాయణపూర్ ప్రాజెక్టులోకి 29,800 వేల క్యూసెక్కుల వరద వస్తోంది. 25,063 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 37.64 టీఎంసీలు కాగా ప్రస్తుతం 29.91 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాలకు 40 వేల క్యూసెక్కులు, తుంగభద్రకు 43 వేల క్యూసెక్కులకు వరద వస్తోంది. 52,468 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు నీటిమట్టం 7.224 టీఎంసీలకు నీటి నిల్వ చేరుకుంది. జూరాల ఎగువ కేంద్రంలో ఐదు యూనిట్ల ద్వారా 34.713 మిలియన్ యూనిట్లు, దిగువ కేంద్రంలో ఆరు యూనిట్ల ద్వారా 38.506 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి జరుగుతోంది. శ్రీశైలం ప్రాజెక్టులోకి 42 వేల క్యూసెక్కులు, నాగార్జునసాగర్‌లోకి 11 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టులకు స్వల్పంగానే వరద వస్తోంది. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులకు గాను, 847.10 అడుగులకు నీటిమట్టం చేరింది. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 215.807 టీఎంసీలు. ప్రస్తుతం 73.9870 టీఎంసీల నీరు ఉంది. మహారాష్ట్ర ఔరంగాబాద్ శివారులోని పైఠన్ పట్టణంలో ఉన్న జైక్వాడి ప్రాజెక్టులోకి 819 క్యూసెక్కులు, సింగూరులోకి 600 క్యూసెక్కులు, శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి 599 క్యూసెక్కులు, మిడ్‌మానేరులోకి 125 క్యూసెక్కులు, శ్రీపాద ఎల్లంపల్లిలోకి 454 క్యూసెక్కుల వరద వస్తోంది.

## ప్రధాని మోడీ పర్యటన షెడ్యూల్ ఖరారు

- మూడు రాష్ట్రాల్లో రెండు రోజుల పర్యటన
- 21న విశాఖలో అంతర్జాతీయ యోగాకు హాజరు



**న్యూఢిల్లీ, జూన్ 19 :** భారతదేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈనెల20, 21వ తేదీల్లో మూడు రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. బీహార్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రల్లో పర్యటించనున్నట్లు అధికారికంగా ప్రధాని కార్యాలయం ప్రకటించింది. బీహార్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధాని మోదీ ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేయనున్నారు. ఒడిశాలో కొత్త ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమానికి ప్రధానమంత్రి హాజరవుతున్నారు. 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలో నిర్వహించే కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలుపంచుకోనున్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి విశాఖ కేంద్రంగా ప్రధాని మోదీ నేతృత్వం వహించనున్నారు. 21వ తేదీన ఉదయం 6.30గంటలకు యోగా అనంతరం మోదీ ప్రసంగించనున్నారు. విశాఖ బీచ్ రోడ్డులో నిర్వహించే యోగా కార్యక్రమానికి సామాన్య ప్రజలతో కలిసి మోదీ పాల్గొంటారని ప్రధాని కార్యాలయం ప్రకటించింది. ఈ కార్యక్రమానికి సుమారు 5 లక్షల మంది హాజరవుతారని ప్రధాని కార్యాలయం తెలిపింది.

# సెల్‌ఫోన్ ఇవ్వాల్సిందే..

- కుదరదంటున్న మాజీ మంత్రి కేటీఆర్
- సెల్‌ఫోన్ వ్యవహారంపై పట్టుదలగా ఏసీబీ




**హైదరాబాద్, జూన్ 19 :** ఫార్ములా ఈ కార్ రేస్ కేసు ఇప్పుడు సెల్ ఫోన్ చుట్టూనే తిరుగుతుంది.. కేటీఆర్ సెల్‌ఫోనే ఏసీబీ అధికారులకు కీలకంగా మారింది.. సెల్‌ఫోను ఇచ్చేది లేదని కేటీఆర్ ఏసీబీకి కరాకండిగా తేల్చి చెప్పారు.. గతంలో వాడిన సెల్ ఫోను ఇప్పుడు తన దగ్గర లేదని, ఇప్పుడు కొత్త ఫోన్ వాడుతున్నానని చెప్పారు.. ఇందుకు సంబంధించి లిఖిత పూర్వకంగా ఏసీబీ అధికారులకు కేటీఆర్ సమాధానం పంపాడు.. అయితే ఫోన్ ఇవ్వకపోతే తదుపరి చర్యలకు తాము సిద్ధమని ఏసీబీ అధికారులు అంటున్నారు.. ఎలాంటి చర్యలు తీసుకుంటారనీ ఏసీబీ మాత్రం చెప్పడం లేదు. మరోవైపు వ్యక్తిగత గోప్యత భంగం కలిగించే విధంగా ఫోన్ అడగడం చట్ట వ్యతిరేకమని కేటీఆర్ వాదిస్తున్నాడు.. సెల్ ఫోనుకు సంబంధించిన వ్యవహారంలో సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నాయని, దాని ప్రకారం ఎవరు కూడా వ్యక్తిగత సమాచారం సెల్ఫోన్ లాంటివి అడగవద్దని అంటున్నారు.. అంతే కాదు.. అసలు తన సెల్ ఫోన్ ఏసీబీ వాళ్లకు ఎందుకు అవసరం ఉందో అనే విషయాన్ని చెప్పడం లేదని అంటున్నారు.. దానికి తోడు తన సెల్ ఫోన్‌తో వాళ్లకు ఏమీ పని అని ప్రశ్నిస్తున్నారు.. ఏది ఏమైనా తాను మాత్రం సెల్ఫోన్ ఇచ్చేది లేదని అంటూనే, మరొకవైపు ఈ ఏడాది నుంచి తాను కొత్త సెల్ ఫోన్ వాడుతున్నట్లు తెలిపారు.. 2021-2023 మధ్యకాలంలో కేటీఆర్ వాడిన సెల్ఫోన్

# బనకచర్లపై బిఆర్ఎస్ రాజకీయ చిచ్చు!




బనకచర్ల ప్రాజెక్టుపై రాజకీయ నాయకులు మళ్ళీ వివాదం రేపి పబ్బం గడుపుకునే ప్రయత్నంలో ఉన్నారు. గతంలో ఉమ్మడి ఎపిలో బాబ్లీ గొడవ చేశారు. అది సమిసిపోయింది. తాజాగా బనకచర్ల దొరికింది. ఇప్పుడు దీనిని సాగదీస్తూ, సమస్యలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేసే యత్నాలు మొదలయ్యాయి. రాయల సీమకు నీరందిస్తామని జగన్‌తో లంచ్ మీటింగ్‌లో ప్రకటించిన కెసిఆర్ పార్టీ బిఆర్ఎస్ ఇప్పుడు బనకచర్లపై విమర్శలు అందుకుంది. బనకచర్ల అనేది వృధాగా పోతున్న గోదావరి నీళ్లను మాత్రమే నిల్వచేసే ప్రాజెక్ట్. దీని నిర్మాణంతో ఎగువన ఉన్న తెలంగాణలో నీటిని తరలించుకునే అవకాశం లేదు. పైన నీళ్లు లేకుంటే గోదావరి ఎండిపోతుంది. అప్పుడు బనకచర్లకు నీరు వెళ్లడం అసాధ్యం కూడా. మొన్నటి వరకు తెలుగు రాష్ట్రాలు ఒక్కటే. ఉమ్మడి ఎపి అయినా, విడిపోయి రెండు రాష్ట్రాలుగా వేరయినా రైతులు, ప్రజలు ప్రయోజనాలు పొందాల్సిందే. నిజానికి గోదావరిలో ఏటా వందల టిఎంసిల నీరు వృధాగా సముద్రంలో కలుస్తున్నాయి. ఇలా మనం ఏటా వర్షాకాలంలో వృధాగా పోతున్న నీటిని చూసి చింతిస్తున్నాం తప్ప అడ్డుకట్ట వేయడానికి ప్రయత్నించడం లేదు. కాళేశ్వరం పేరుతో కట్టిన ఆనకట్ట వృధాగా పోయింది. కేవలం కమీషన్ల కోసం కట్టి ఇంజనీరింగ్ ప్రతిభ అని చెప్పుకున్న కెసిఆర్, ఇప్పుడేమో, దానిపై విచారణ సాగగానే మాటమారుస్తున్నారు. కాళేశ్వరం సరిగా కట్టివుంటే, సరైన ప్రాంతంలో డిజైన్ చేసివుంటే గోదావరి నీళ్లను మనం ఉపయోగించుకునే వీలుండేది. కానీ ఇప్పుడది తెల్ల ఏనుగులా మారింది. రాజకీయ నాయకులు తమ పబ్బం గడుపుకోవడానికి ఎలా వ్యవహరిస్తారన్న దానికి కాళేశ్వరం ప్రత్యేక ఉదాహరణ. బిబిసి సహా అనేక చోట్ల దీనిని మానవనిర్మిత అద్భుతంగా ప్రచారం చేసుకున్న కెసిఆర్, ఆయన బృందం ఇప్పుడు కేబినేట్ అనుమతితోనే నిర్మించామని మాటమార్చారు. నిజానికి గోదావరి జలాలను ఎంతగా వినియోగించుకుంటే అంతమంచిది.

చుక్కనీరు కూడా సముద్రంలో కలిసి పోకుండా తెలంగాణ, ఎపిలు ఉమ్మడిగా ప్రణాళికలు సిద్దం చేయాలి. అంతేగాని వివాదాలు కాదు. దీనికోసం కేంద్రాన్ని కలవడం, సుప్రీం కోర్టుకు వెళ్లడం సరికాదు. ఈ వ్యయహారంలో చిచ్చురాజేసి చలి కాచుకోవాలన్న బిఆర్ఎస్ ప్రయత్నాలు కూడా ఆమోద యోగ్యం కాదు. నిజానికి బనకచర్ల అనుసంధానంపై రగడను బీఆర్ఎస్ పార్టీ ప్రముఖంగా లేవదీసింది. ఆ పార్టీ అధికార మీడియాలో ప్రతిరోజూ వరసబెట్టి ఈ అనుసంధానానికి, ఆంధ్రప్రదేశ్‌కు వ్యతిరేక కథనాలు వస్తున్నాయి. ఎగువ రాష్ట్రమైన తెలంగాణ ఉపయోగించుకోగా మిగిలిన నీరే కిందకు పోతుందనే స్పృహ లేకుండా బీఆర్ఎస్ తీరు ఉంది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ కుంభకోణం బీఆర్ఎస్ పార్టీ మెడకు చుట్టుకోవడంతో దాన్ని పక్కదారి పట్టించేందుకు బనకచర్ల వ్యవహారాన్ని బిఆర్ఎస్ ప్రచారం చేసుకుంటోంది. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీలో పిల్లర్లు దెబ్బ తిని నీటిని నిల్వ చేయక పోవడానికి, అవినీతిపై కమిషన్ విచారణ చేయడంతో వ్యూహాత్మకంగా బిఆర్ఎస్ బరితెగింపు రాజకీయం చేస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై న్యాయ విచారణ జరుపుతున్న ఘోష్ కమిషన్ ముందు కేసీఆర్ విచారణకు హాజరై ప్రశ్నలకు సమాధానమిచ్చారు. అయితే కాళేశ్వరం ఎపిసోడ్ నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు బీఆర్ఎస్ పార్టీ బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టుపై దుమ్మెత్తి పోస్తోందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇలాంటి వాదనలు తీసుకుని వచ్చే వారి రాజకీయ దురుద్దేశ్యాలను ఎండగట్టాల్సిందే. ఈ నీటిని పూర్తిగా ఎలా నిలువరించాలో ఆలోచన చేయాలి. తెలంగాణ వాడుకోగా మిగిలిన నీళ్లు కిందకు వస్తేనే ఆంధ్రప్రదేశ్ ఉపయోగించుకొనే వీలుంటుంది. అప్పుడే బనకచర్లకు నీరు వెళుతుంది. అంతే తప్ప సము ద్రంలోకి వెళ్లదు. ఈ ఆలోచన మంచిదే. మహారాష్ట్ర కట్టిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తితేనే శ్రీరామ్‌సాగర్‌కు నీళ్లు వస్తున్నాయి. గోదావరి నదిలో దిగువ రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ తన వాటాకు మించి ప్రాజెక్టులు కట్టుకొం టేపై నుంచి అవసరమైన మేరకు నీళ్లు రాకుంటే అవి వృధాగా ఉండా ల్సిందే. బనకచర్ల ద్వారా వృధానీటి తరలింపు సఫలమైతే నదుల అను సంధానానికి అడుగు వేసిన వారం అవుతాం. కేంద్రం కూడా ఇలాంటి సమస్యలపై సత్వరంగా స్పందించి, ఇరు రాష్ట్రాల ప్రతినిధులతో చర్చిం చాలి. అంతేతప్ప తాత్సారం చేయరాదు. చోద్యం చూడరాదు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నీటివాటాల వివాదం అపరిష్కృతంగా ఉంది. కృష్ణా విషయంలో తరచూ కీచులాటలు తప్పడం లేదు. ఒకవేళ బనకచర్ల సాకారం అయితే కృష్ణాపై ఒత్తిడి తగ్గుతుంది. గోదావరి ట్రిబ్యునల్ కేటాయించిన 1486.85 టీఎంసీల్లో 957.85 టీఎంసీల నీళ్లు తమవని తెలంగాణ చెబుతున్నది.

ఇదే నిజమైతే...ఈ నీటిని నిలవచేయడానికి అవసరమైన ప్రాజెక్టులు నిర్మించాలి. ట్రిబ్యునల్ నియామకమైతే దాని ముందు తన వాటాను గురించి వాదించవ చ్చు. ప్రస్తుతం తను చెబుతున్న వాటా మేరకు కొన్ని ప్రాజెక్టుల డీపీఆర్‌లు ఆమోదం కోసం కృషి చేస్తున్నది. తెలంగాణ కూడా గోదావరి జలాలను ఒడిసిపట్టే ప్రయత్నం చేయడంలో తప్పు లేదు. అయితే దిగువ రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ ఎన్ని ప్రాజెక్టులు కట్టుకున్నా, ఇక్కడి నుంచి నీరు కిందికి పోతేనే వారి ప్రయత్నం ఫలిస్తుంది. ఎగువ రాష్ట్రాలు నిర్మించే ప్రాజెక్టు లపై సాధారణంగా దిగువ రాష్ట్రాలు అభ్యంతరాలు చెబుతాయి. ఎందుకంటే దిగువన ఉన్న తమకు నీరు వస్తుందో రాదో అన్న భయం ఉంటుంది. ఆల్మట్టి, నారాయణపూర్ , బాబ్లీ ప్రాజెక్టులు ఇలా కట్టినవే. దీంతో కృష్ణా గోదవరుల్లో సకాలంలో నీరు రావడం లేదు. ఎగువన భారీ వర్షాలు పడి, ప్రాజెక్టుల్లోకి నీరు వస్తేనే కృష్ణమ్మ గలగలలు వినిపిస్తాయి. ఇదే క్రమంలో తెలంగాణ ప్రాజెక్టులు కడితే ఎపికి నష్టం తప్ప, ఎపి ప్రాజెక్టులు కడితే తెలంగాణకు నష్టం ఉండబోదు. పోలవరం వల్ల వరద ముంపు ఉందంటున్న తెలంగాణ నేతలు, దాని నీరు మరింతగా రాకుండా కిందకు వెళితే మంచిదే అన్న విషయం ఆలోచించడం లేదు. దిగువన ఉండే ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టులు కట్టుకొంటే ఎగువన వుండే తెలంగాణకు ఏ విధంగా నష్టం కలుగుతుందో బిఆర్ఎస్ నేత హరీష్‌రావు చెప్పాలి. రాయలసీమకు నీళ్లు పారిద్దామన్న కెసిఆర్ ఈ పంచాయితీపై ఎందుకు నోరు మెదపడం లేదో చెప్పాలి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఉన్న ప్రాజెక్టులకు వాడుకోగా ఏటా అపారమైన వరదనీరు వెల్లువెత్తుతుంది. ఈ వరదనీటిని వాడుకొనేందుకే గోదావరిపై బనకచర్ల అనుసంధానం రూపకల్పన చేస్తున్నారు. ఈ వివాదం జటిలం కావడానికి బిఆర్ఎస్ కారణం తప్ప మరొకరు కాదు. దీంతో పాటు జగన్మోహన్‌రెడ్డి కూడా బాధ్యులే. 2020లో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో కృష్ణ జలాలు పంపకానికి తోడు, గోదావరి జలాల వాటాలు తేల్చేందుకు ట్రిబ్యునల్ వేయాలని తీర్మానం చేశారు. అయితే కృష్ణ జలాల ట్రిబ్యునల్ కోసమే కేసీఆర్ పట్టుబట్టారు. దానితో బీజేపీ 2023 ఎన్నికల్లో రాజకీయ లబ్ది కోసం కృష్ణా ట్రిబ్యునల్ వేసింది. కానీ గోదావరి ట్రిబ్యునల్ ఇంతవరకు వేయలేదు. కేసీఆర్ లాగా జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం గోదావరి ట్రిబ్యునల్ కోసం కేంద్రం వెంట పడలేదు. సంవత్సరం గడచిపోయినా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం కూడా గోదావరి ట్రిబ్యునల్‌పై అంత పట్టుదలగా లేదు. గోదావరి ట్రిబ్యునల్ నియామకమై ఎవరి వాటాలు ఎంతో తేలిపోయి ఉంటే, ఇప్పుడు గోదావరి బనకచర్ల అనుసంధానంపై తెలంగాణ వ్యతిరేకించే అవకాశం ఉండేది కాదు. పైగా ఏ నదీ పరీవాహక ప్రాంతంలోనైనా చిట్టచివరన వుండే రాష్ట్రానికి మిగులుతో పాటు వరద జలాలపై హక్కులు లభిస్తాయి. ఇది గుర్తిస్తే మంచిది

# అమెరికా వెళ్లే విద్యార్థులకు వీసోదయం

- వీసా ఇంటర్వ్యూలను పునరుద్ధరిస్తున్నట్లు ప్రకటన
- సోషల్ మీడియా ఖాతాలను పరిశీలిస్తామని వెల్లడి




**వాషింగ్టన్, జూన్ 19 :** అమెరికాలో చదువుల కోసం ఎదురుచూస్తున్న విదేశీ విద్యార్థులకు అగ్రరాజ్యం గుడ్‌న్యూస్ చెప్పింది. ఇటీవల తాత్కాలికంగా నిలిపివేసిన విద్యార్థి వీసా ఇంటర్వ్యూల షెడ్యూలింగ్‌ను మళ్లీ ప్రారంభించింది. అయితే, వీసా కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థుల సోషల్ మీడియా ఖాతాలను తప్పనిసరిగా తనిఖీ చేస్తామని వెల్లడించింది. ఈమేరకు అమెరికా విదేశాంగ శాఖ తాజాగా మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ ఏడాది మే చివరి వారం నుంచి ప్రపంచవ్యాప్తంగా ఉన్న అమెరికా రాయబార కార్యాలయాల్లో కొత్తగా దరఖాస్తు చేసుకునే విద్యార్థుల వీసా ఇంటర్వ్యూల షెడ్యూలింగును తాత్కాలికంగా నిలిపివేసిన సంగతి తెలిసిందే. వీసా జారీకి అవసరమైన సామాజిక మాధ్యమ ఖాతాల పరిశీలనకు సన్నాహాలు చేస్తున్నామని, అందుకే వీసాల జారీని నిలిపివేశామని అప్పట్లో విదేశాంగ శాఖ వెల్లడించింది. ఈ క్రమంలోనే తాజాగా సోషల్ మీడియా వెట్టింగ్‌ను తప్పనిసరి చేస్తూ వీసా అపాయింట్‌మెంట్ల ప్రక్రియను పునరుద్ధరించింది. ఈ సోషల్ మీడియా వెట్టింగ్‌తో తమ దేశంలోకి వచ్చేందుకు ప్రయత్నించే ప్రతి వ్యక్తిని పూర్తిగా పరిశీలించేందుకు వీలు లభిస్తుంది. వీసా దరఖాస్తుదారులకు అనుమతి ఇవ్వొచ్చా.. లేదా అనే దాన్ని అంచనా వేయడం కోసం వారి ఆన్‌లైన్ యాక్టివిటీని అధికారులు తనిఖీ చేయనున్నారు. దీన్నే 'సోషల్ మీడియా వెట్టింగ్' అంటారు. సంబంధిత విద్యార్థుల సోషల్ మీడియా ప్రొ÷ల్లైను పరిశీలించిన తర్వాతే వీసా మంజూరు చేస్తారు. ఉదాహరణకు.. ఎవరైనా విద్యార్థి తమ సామాజిక మాధ్యమ ఖాతాలో పాలస్తీనా జెండాను పోస్ట్ చేసినట్లయితే ఆ వ్యక్తిని క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. వారి వల్ల దేశ భద్రతకు ఏ ప్రమాదం లేదని నిర్ధరించుకున్న తర్వాతే వారిని అమెరికా విద్యాసంస్థల్లో చదువుకునేందుకు అనుమతినిస్తారు. అప్పుడే వారికి విద్యార్థి వీసా లభిస్తుంది. వీసా కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థుల సామాజిక మాధ్యమ ఖాతాలను యూఎస్ కాన్సులర్ అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేస్తారు. ఇందుకోసం దరఖాస్తుదారులు తమతమ సోషల్ మీడియా ప్రొఫైళ్ల ప్రైవేటు సెట్టింగ్స్‌ను మార్చుకుని 'పబ్లిక్' ఆప్షన్ పెట్టుకోవాలి' అని విదేశాంగ శాఖ సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు.

# అదనపు కట్నం కోసం వేధింపులు

## దుర్గం చెరువులో దూకి యువతి ఆత్మహత్య




**హైదరాబాద్, జూన్ 19 :** నగరంలోని మాదాపూర్ దుర్గంచెరువు కేబుల్ బ్రిడ్జి పైనుంచి దూకి యువతి ఆత్మహత్యకు పాల్పడింది. మృతిచెందిన యువతిని సుష్మ(27)గా గుర్తించారు. మాదాపూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ అడ్డగుట్టలో సుష్మ నివాసముంటోంది. బుధవారం హైటెక్ సిటీలోని ఆఫీస్‌కి పని నిమిత్తం ఆమె వెళ్లింది. రాత్రి తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆఫీస్ మేనేజర్‌కు తండ్రి అంజయ్య కాల్ చేశారు. రాత్రి 10.30 గంటలకే ఆమె బయల్దేరినట్లు మేనేజర్ తెలిపారు. ఈ క్రమంలో హైదరాబాద్ మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దుర్గం చెరువులో ఓ యువతి మృతదేహం లభ్యమైంది. ఈ విషాద ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం రేపింది. పోలీసులు ప్రాథమికంగా ఇది ఆత్మహత్యగా అనుమానిస్తున్నారు. బాధితురాలిని సుష్మ (27)గా గుర్తించారు. ఈ రోజు తెల్లవారుఝామున 4 గం టలకు బొట్టు అంజయ్య అనే వ్యక్తి మిస్సింగ్ కంప్లైంట్‌ను మాదాపూర్ పోలీసులకు ఇచ్చారు. 'ఆఫీస్‌కు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన సుష్మ తిరిగి రాకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అయితే ఉదయం 7 గంటలకు దుర్గం చెరువు వద్ద ఒక మృతదేహం కనిపించిందని సమాచారం అందింది. హుటాహుటిన అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీశారు. అది మిస్సింగ్ అయిన సుష్మదిగా గుర్తించారు.

### అదనపు కట్నం కోసం...

సుష్మ ఈ ఏడాది జనవరి 31న అమృత్ అనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను వివాహం చేసుకుంది. అమృత్ కూడా ఓ ప్రముఖ ఐటీ కంపెనీలో పనిచేస్తున్నాడని పోలీసులు తెలిపారు. సుష్మ తల్లిదండ్రుల ప్రకారం.. పెళ్లి సమయంలో 6 తులాల బంగారం, రూ.5 లక్షల నగదు, బైక్‌ను కట్నంగా ఇచ్చారు. అయినప్పటికీ సుష్మ అత్త, మామలు అదనపు కట్నం కోసం వేధించారని, ఇటీవల ఆమె శారీరకంగా, మానసికంగా తీవ్రంగా బాధపడుతోందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కొద్దీ రోజులుగా ఆరోగ్యం బాగాలేదని, నేరెడ్‌మేట్‌లోని ఓ హాస్పిటల్‌లో సుష్మను రెండు రోజుల క్రితం వైద్యులకు చూపించినట్లు తల్లిదండ్రులు వెల్లడించారు. అయితే.. బుధవారం ఆమె తిరిగి ఆఫీస్‌కు వెళ్తున్నానంటూ ఇంటి నుంచి వెళ్లిపోయింది. కానీ తిరిగి రాలేదని వారు తెలిపారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో, సుష్మ తన అత్తింటి వారు, భర్త నుంచి ఎదుర్కొంటున్న అవమానాన్ని తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడిందని అనుమానిస్తున్నారు. మాదాపూర్ సీఐ కృష్ణ మోహన్ మీడియాతో మాట్లాడుతూ, 'కేసు నమోదు చేశాం. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. విచారణ కొనసాగుతోంది' అని తెలిపారు. కుమార్తె కనిపించడం లేదంటూ ఉదయం 4 గంటలకు మాదాపూర్ పీఎస్ లో అంజయ్య ఫిర్యాదు చేశారు. దుర్గంచెరువులో మృతదేహం తేలి యాడుతోందని గురువారం ఉదయం 7 గంటలకు పోలీసులకు సమాచారం అందింది. అక్కడికి చేరుకున్న పోలీసులు.. మృతదేహం సుష్మదిగా గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై మాదాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు.



# ముంబైని ముంచెత్తిన భారీ వర్షం

**ముంబయి, జూన్ 19 :** మహారాష్ట్ర రాజధాని ముంబయిలో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. రోడ్లన్నీ జలమయంగా మారాయి. రోడ్లపై నీరు చేరడంతో వాహనాలు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. భారీ వర్షం కురుస్తుండడంతో ప్రజలు ఎవరు బయటకు రావడంలేదు. వాతావరణ శాఖ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. బుధవారం సాయంత్రం నుండి ఇప్పటివరకు 200 మి.మీ. వర్షపాతం నమోదైందని వెల్లడించింది. ముంబయి, పరిసర ప్రాంతాలకు ఐఎండి ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. భారీ వర్షాల కురస్తున్న నేపథ్యంలో ప్రజలు అత్యవసరమయితే తప్ప బయటకు రావద్దని వాతావరణ శాఖ అధికారులు సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో నీటి మట్టం పెరుగుతుండడంతో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ప్రజలు అధికారిక సూచనలను పాటించడంతో పాటు అపోహలకు లోనుకావొద్దని హెచ్చరికలు జారీ చేశారు.

# రెడ్‌బుక్ తప్ప పేదలను ఆదుకునే చర్యలేవీ

- ఆడపిల్లల రక్షణకు తీసుకుంటున్న చర్యలు శూన్యం
- చంద్రబాబు తీరుపై మండిపడ్డ జగన్



**అమరావతి, జూన్ 19:** ఎంత సేపు 'రెడ్ బుక్.. రెడ్ బుక్' తప్ప పేదలకు న్యాయం చేయాలనే ఆలోచన కూటమి ప్రభుత్వానికి కనిపించడం లేదని జగన్ పేర్కొన్నారు. వైసీపీ కేంద్ర కార్యాలయంలో జగన్ మీడియాతో మాట్లాడారు. రామగిరి మండలం ఏడుకుర్రాకులలో తొమ్మిదో తరగతి చదువుతున్న బాలికను 14 మంది టీడీపీ వాళ్లు సామూహిక అత్యాచారాన్ని చేశారు. కనీసం ఫిర్యాదు కూడా ఇవ్వనీయకుండా భయపెట్టింది నిజం కాదా?. తండ్రి లేని ఆ కుటుంబాన్నీ భయపడితే వాళ్లు ఊరు విడిచి వెళ్లింది నిజం కాదా?. ఆ బాలికకు న్యాయం చేసే దమ్ము చంద్రబాబుకు లేదా?. న్యాయం చేయాలనే సిన్సియారిటీ ఆయనకు లేదు. అనంతపురం జిల్లాలో ఇంటర్ చదువుతున్న గిరిజన బాలిక కనిపించటం లేదని తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఆరు రోజుల తర్వాత ఆ పాప శవమై దొరికింది. కుప్పం నియోజకవర్గంలో అప్పు చెల్లించలేదని మహిళను చెట్టుకు కట్టేశారు. ఈ మనిషా ఆడవారి గౌరవం గురించి మాట్లాడేది. ఎంత సేపు రెడ్ బుక్.. రెడ్ బుక్ తప్ప పేదలకు న్యాయం చేయాలనే ఆలోచన ఏది?' అని వైఎస్ జగన్ మండిపడ్డారు. 'ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ అన్నాడు.. సూపర్ సెవెన్ అన్నాడు. ప్రతీ కుటుంబంలో మహిళలు తన సొంత కాళ్ల మీద నిలబడాలి. మహిళలు స్వయంగా వాళ్ళ కాళ్ల మీద వాళ్లు నిలబడాలి అని ఆరాట పడ్డాం. మహిళలకు ఎంతో చేసింది ఒక్క వైసీపీ ప్రభుత్వం మాత్రమే. చట్టం చేసి మరీ 50 శాతం పదవులు మహిళలకు ఇచ్చిన ఘనత జగన్‌దని అన్నారు. ఎవరికి మహిళల మీద గౌరవం ఉంది అని అడుగుతున్నా. మంచి చేసినా మాకా.. ఆ ముసుగులో ఇలాంటి పనులు చేసిన ఆయనకా. మహిళలకు అయినా.. పిల్లను ఇచ్చిన మామకు అయినా వెన్నుపోటు పొడవటంతో ఆయనకు ఆయనే సాటి. ఎన్నికల ముందు జగన్ సంక్షేమ కార్యక్రమాలు ఆగిపోవు.. ఇంకా మెరుగైన కార్యక్రమాలు చేపట్టి ముందుకు తీసుకెళ్తా అని చెప్పిన చంద్రబాబు.. చూ మంతర్ అంటూ సూపర్ సిక్స్ మొత్తం చేసేసా అని చెబుతున్నారు. ఎవరైనా సూపర్ సిక్స్ అని అడిగితే నీ నాలుక మందం అని బెదిరిస్తున్నారు. నిరుద్యోగ యువతకు ఏడాదికి 36 వేలు ఇస్తామని చెప్పారు.. ఎంత ఇచ్చారు. ఒక్కరికి ఇచ్చిన పాపాన పోలేదు. 18 ఏళ్లు నిండిన మహిళకు ఆడబిడ్డ నిధి ఇస్తామన్నారు.. 2.10 కోట్ల మంది మహిళలు ఓటర్లుగా ఉన్నారు. 'మహిళలకు ఉచిత బస్సు అన్నిట'కన్నా సులభం. రాష్ట్రంలో మహిళలు మొత్తం ఎదురుచూస్తున్నారు. సంవత్సరం అయ్యింది, పండుగల పేర్లు మారుతున్నాయి. అధ్యయనం కోసం ఎక్కడికో వెళ్ళాల్సిన పనేముంది.. ఆర్టీసీకి డబ్బులు ఇస్తే చాలు. ఎవరికి కావలసిన వాళ్ళు అక్కడకు వెళ్ళి చూసి వస్తారు. 50 ఏళ్లకు పెన్షన్ అన్నారు.



# నిధులు జమ కాకుంటే అధికారులను కలవండి

## రైతులకు మంత్రి తుమ్మల సూచన

**హైదరాబాద్, జూన్ 19 :** రైతు భరోసా నిధులు జమకాని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హత ఉండి.. బ్యాంకు అంకౌట్లలో డబ్బులు పడని రైతులు స్థానిక వ్యవసాయ అధికారులను సంప్రదించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. మరోవైపు.. రాష్ట్రంలో కొత్తగా భూముల యాజమాన్యం పొందిన రైతులకు కూడా రైతు భరోసాకు అర్హులవుతారని ప్రభుత్వం తెలిపిన విషయం విధితమే. జూన్ 5వ తేదీ వరకు భూమి యాజమాన్య హక్కులు పొందిన రైతులు కూడా ఈ పథకానికి అర్హులుగా ప్రభుత్వం పరిగణిస్తుంది. క్రమంలో ప్రభుత్వం నిర్ణయించిన జూన్ 20వ తేదీ వరకు రైతు భరోసా పథకం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకోవాలని భావించిన వారు సంబంధిత ఏఈవో దగ్గరకు వెళ్లి అవసరమైన డాక్యుమెంట్లు సమర్పించాల్సి ఉంటుందనీ తెలిపారు.. జూన్ 20వ తేదీ వరకు అలా అప్లయ్ చేసుకున్న వారికి మాత్రమే రైతు భరోసా సాయం అందుతుందని అధికారులు తెలిపారు. తెలంగాణ రైతాంగానికి రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. రైతు భరోసా నిధులను విడుదల చేస్తోంది. తాజాగా మరో రూ. 1189.43 కోట్లను విడుదల చేసింది. ఐదు ఎకరాల వరకు రైతు భరోసా నిధులు జమ చేసిన సర్కార్.. గురువారం నాడు మరికొంత మంది రైతుల ఖాతాల్లో నిధులు జమ చేసింది. అధికారిక సమాచారం ప్రకారం.. గురువారం నాడు 4,43,167 మంది రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా నిధులు జమ చేసింది. ఇప్పటి వరకు 62.47 లక్షల మంది రైతుల ఖతాల్లో రూ. 6404.7 కోట్లను ప్రభుత్వం జమ చేసింది. ఇక భూమి పరంగా చూసుకుంటే.. 106 లక్షల ఎకరాకు పంట సహాయం అందించినట్లు ప్రభుత్వం ప్రకటించింది.

# తిరుమలలో ఆర్టీసీ ఉచిత బస్సులు

## ప్రారంభించిన టిటిడి అదనపు ఇవో వెంకయ్య చౌదరి



**తిరుమల, జూన్ 19 :** తిరుమలలో శ్రీవారి రథాలకు తోడు ఉచితంగా ఆర్టీసీ బస్సులను నడుపనుంది. భక్తులను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి చేరవేసేందుకు ఏపీఎస్‌ఆర్టీసీ బస్సుల ద్వారా ఉచిత సర్వీసులను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి తెలిపారు. తిరుమలలోని అశ్వినీ ఆసుపత్రి సర్కిల్ వద్ద గురువారం ఆయన జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకయ్య చౌదరి మాట్లాడుతూ.. తిరుమలలో భక్తుల నుంచి ప్రైవేటు వాహనాల వారు అధికంగా డబ్బులు వసూలు చేయడాన్ని అరికట్టేందుకు, కాలుష్యాన్ని నియంత్రించేందుకు బస్సులను ఉచితంగా తిప్పాలని ఏపీఎస్ ఆర్టీసీని కోరినట్లు తెలిపారు. సానుకూలంగా స్పందించిన ఆర్టీసీ యాజమాన్యం.. తిరుమలలో బస్సులను ఉచితంగా నడిపేందుకు ముందుకు రావడం హర్షించదగ్గ విషమయన్నారు. ఇందుకు ఆర్టీసీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. తిరుమలలో శ్రీవారి ధర్మ రథాలు తిరిగే మార్గంలోనే ఆర్టీసీ బస్సులు తిరుగుతూ ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి భక్తులను ఉచితంగా చేరవేస్తాయని వెల్లడించారు.



## ప్రజా నాయకుడు మంద కృష్ణ మాదిగ

- వికలాంగుల హక్కుల పోరాట సమితి ప్రతినిధులు
- మందకృష్ణ మాదిగ కి పద్మశ్రీ రావడం సంతోషకరం: గుత్తికొండ కిరణ్, నాయకులు బొడ్డు వెంకన్న

**నాగోల్, రాజముద్ర న్యూస్:** మాదిగల హక్కుల కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థను స్థాపించి, 30 ఏళ్ల పాటు సుదీర్ఘ పోరాటం చేసి ఎస్సీ విభజన చట్టాన్ని సాధించిన మందకృష్ణ మాదిగ అసలైన ప్రజా నాయకుడని వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు కొనియాడారు. మంద కృష్ణ మాదిగ పద్మశ్రీ అవార్డు అందుకున్న నేపథ్యంలో గురువారం నగరంలోని నాగోల్ శుభం ఫంక్షన్ హాల్ లో పౌర సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఓవైపు ఎస్సీ రిజర్వేషన్ల విభజన కోసం పోరాడుతూనే, మరోవైపు బీసీలు బడుగు బలహీన వర్గాల కోసం ఎనలేని పోరాటాలు చేశారని, దివ్యాంగుల కోసం వారికి ప్రభుత్వ పథకాలు అందించడం కోసం నిరంతరం పోరాటం చేశారని కొనియాడారు. దివ్యాంగులకు ఎటువంటి కష్టాలు ఎదురైన తానున్నానని ముందు నిలబడి పెద్దదిక్కుగా నిలవడం సంతోషకరమన్నారు. భవిష్యత్తులో మందకృష్ణ మాదిగ మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి చరిత్రలో నిలిచిపోవడం ఖాయమని వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు భరోసా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వికలాంగుల హక్కుల రాష్ట్ర సమితి అధ్యక్షుడు గుత్తికొండ కిరణ్, నాయకులు బొడ్డు వెంకన్న, జగన్, నాగరాజు, యశోద, ఉమారాణి, కళాజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.



## భూ సమస్యలు రెవెన్యూ సదస్సులోనే పరిష్కరించలి

### - వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** భూ సమస్యలను సాధ్యమైనంత వరకు రెవెన్యూ సదస్సులోనే పరిష్కరించాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. గురువారం వికారాబాద్ మండలం పరిధిలోని అత్వెల్లి గ్రామం, వికారాబాద్ మునిసిపల్ పరిధిలోని కొత్రే పల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులను వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలను స్వయంగా వివరాలుఅడిగి తెలుసుకున్నారు. భూ సమస్యల పరిష్కార వేదికలుగా రెవెన్యూ సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తుల వివరాలను దరఖాస్తులు ఆన్లైన్ లో నమోదు చేస్తున్నారా, డిఎస్ పెండ్డింగ్ ఉందా, మీ సేవలో దరకాస్తు చేశారా , వెరిఫై చేసారా, మీకు ఏ సమస్యలు ఉన్న రైతు సదస్సు లో దరకాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాల నమోదులో ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. స్వీకరించిన దరఖాస్తులకు రసీదులు అందించాలని, సంబంధిత రిజిస్టర్లలో తప్పని సరిగా వివరాలు నమోదు చేయాలని సూచించారు. దరఖాస్తుల స్వీకరణ నమోదు రిజిస్టర్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. సమస్యల వారీగా అర్జీలను విభజిస్తూ పక్కాగా రికార్డులను పొందుపర్చాలని అన్నారు. తహసీల్దార్ స్థాయిలో పరిష్కరించదగిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అన్నారు. ప్రజలు సమర్పించే ప్రతి దరఖాస్తును స్వీకరించాలని సూచించారు. ఒకవేళ సమస్యను పరిష్కరించేందుకు నిబంధనలు అంగీకరించని పక్షంలో దరఖాస్తుదారుడికి ఆ విషయాన్ని స్పష్టంగా అర్థమయ్యే విధంగా తెలియజేయాలని అన్నారు. రైతు సదస్సులో అర్జీలు అందించేందుకు వచ్చే రైతులతో సామరస్యంగా వ్యవహరిస్తూ వారి యొక్క సమస్యలను పూర్తిగా విని దరకస్తులను స్వీకరించాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలిస్తూ పూర్తి రికార్డుల ఆధారంగానే వాటిని పరిష్కరించాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, రెవెన్యూ డివిజనల్ అధికారి వాసు చంద్ర, తహసిల్దార్ లక్ష్మీనారాయణ, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పాలసంఘం నూతన అధ్యక్షురాలిగా సోలిపురం మంజుల



**ఆత్మకూరు( ఎం)రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండల పల్లెర్ల గ్రామ పాలసంఘ ఎన్నికలలో నూతన అధ్యక్షురాలిగా సోలిపురం మంజుల రంగారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. నూతన డైరెక్టర్లు గా ఏనుగు మంజుల, సోలిపురం మంజుల లను ఎన్నుకోవడం జరిగింది. కార్యక్రమములో డైరెక్టర్లుగా పెసరికాయల జయమ్మ, సోలిపురం సువర్ణ,అంబోజు ఆండాలు, నాయిని పుష్ప,వంటిపేంటి లక్ష్మమ్మ,నాయిని రమ,బొల్లెపల్లి మహేశ్వరి, వస్తూపుల మరియమ్మ వేతన కార్యదర్శి పాలగాని పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ముత్యాల యాదగిరి యాదవ్ జన్మదిన వేడుకలు

**కుత్బుల్లాపూర్, రాజముద్ర న్యూస్ :** జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి కుత్బుల్లాపూర్ యూత్ ప్రధాన కార్యదర్శి ముత్యాల యాదగిరి యాదవ్ జన్మదిన వేడుకలు బుధవారం తన నివాసంలో ఘనంగా జరుపుకున్నారు. అనంతరం జగదిరిగుట్ట కంటెస్టెండ్ కార్పొరేటర్ జెల్లా మహేష్ యాదవ్ జన్మదిన వేడుకలకు హాజరయ్యారు. యాదగిరి మాట్లాడుతూ.. ఈ సంవత్సరం జరుపుకుంటున్న ఈ జన్మదిన వేడుకలు ఎంతో సంతోషాన్ని ఇచ్చింది అన్నారు. ఎందుకంటే నేను చదువుకున్న కూకట్ పల్లి గవర్నమెంట్ కాలేజ్ ఫ్రెండ్స్ 20 సంవత్సరాల తర్వాత నన్ను కలిసి జన్మదిన వేడుకలో పాల్గొన్నారు. ఈ సంవత్సరం నా పుట్టినరోజు ఎప్పటికీ గుర్తుండిపోతుందని హర్షం వ్యక్తం చేశారు. జన్మదిన వేడుకలో పాల్గొన్న వారు కంటెస్టెండ్ కార్పొరేటర్ జెల్ల మహేష్ యాదవ్, కాలేజ్ మిత్రులు కే.పరమేశ్వరుడు, శ్రీనివాస్ రెడ్డి, సంపత్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# పీర్జాదిగూడ నగరంలో అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం

## మున్సిపల్ కమీషనర్ త్రిలేశ్వరరావు



- వరుస కూల్చివేతలతో బెంబేలెత్తుతున్న అక్రమ నిర్మాణదారులు
- రెండు అంతస్తులకు పర్మిషన్ తీసుకొని అదనపు అంతస్తులు నిర్మించిన నిర్మాణాలపై కొరడా ఝులిపించిన మున్సిపల్ అధికారులు
- అక్రమ నిర్మాణాలు చేస్తే సహించేది లేదు: కమిషనర్ త్రిలేశ్వర రావు
- కమర్షియల్ షెటర్లు, సెల్లార్లు, అదనపు అంతస్తుల నిర్మాణం, పాత గృహాల నిర్మాణాలను కూల్చి కమర్షియల్ షెటర్లు గా మార్చడం, అక్రమ పెంట్ హౌస్ లను నిర్మించొద్దు

### ఫిర్యాదులు అందితే అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తాం

**- టి పి ఎస్ ప్రశాంతి**

పీర్జాదిగూడ నగర పరిధిలో ఎక్కడ అక్రమ నిర్మాణాలు జరిగిన వాటిపై ఫిర్యాదుల అందిన వెంటనే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. దినదినాభివృద్ధి చెందుతున్న పీర్జాదిగూడ నగరంలో అక్రమ నిర్మాణాలకు తావు లేదని అన్నారు. అక్రమంగా షెడ్లు, సెల్లార్లు, అదనపు అంతస్తుల నిర్మాణం, కమర్షియల్ షట్టర్ల నిర్మాణంపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్:** మున్సిపల్ ఆదాయానికి గండి కొట్టి అక్రమంగా అదనపు అంతస్తులు నిర్మిస్తున్న నిర్మాణాలపై మున్సిపల్ అధికారులు కొరడా ఝులిపించారు. వివరాల్లోకి వెళితే... వరంగల్ జాతీయ రహదారిపై, మున్సిపల్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న అక్రమ నిర్మాణాలను గత రెండు రోజులుగా టౌన్ ప్లానింగ్ అధికారిణి ప్రశాంతి, మున్సిపల్ అధికారులు దగ్గరుండి కూల్చివేస్తున్నారు. రాఘవేంద్ర టిఫిన్ సెంటర్ ప్రక్కనగల అక్రమ అదనపు అంతస్తు నిర్మాణాన్ని కూల్చివేశారు. అదేవిధంగా గురువారం మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ దుకాణం ప్రక్కన అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణంపై మున్సిపల్ అధికారులు పోలీసుల సహాయంతో కూల్చివేశారు. పీర్జాదిగూడ కమాన్ రోడ్డులో ఉన్న షట్టర్ లను నేలమట్టం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ త్రిలేశ్వరరావు మాట్లా డుతూ... అక్రమ నిర్మాణాలపై పలుమార్లు ఫిర్యాదులు అందడంతో చర్యలు తీసుకున్నామని తెలిపారు. పీర్జాదిగూడ నగరంలో అక్రమ నిర్మాణాలకు తావు లేదని స్పష్టం చేశారు. మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతూ అక్రమంగా నిర్మిస్తున్న పలు నిర్మాణాలపై చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రభుత్వ అనుమతి లేకుండా, నిబంధనలు పాటించకుండా నిర్మిస్తున్న నిర్మాణాలపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అదేవిధంగా పాత నిర్మాణాలను కూలగొట్టి కమర్షియల్ షెటర్లుగా మారుస్తున్న నిర్మాణాలపై కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు. షెడ్లు, సెల్లార్లు, ప్రభుత్వ అనుమతి లేకుండా నిర్మిస్తున్న నిర్మాణాలపై కూడా కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు.



### మున్సిపల్ సిబ్బందిపై దురుసు ప్రవర్తన:

వరంగల్ జాతీయ రహదారిపై మున్సిపల్ కార్యాలయానికి కూతవేటు దూరంలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణంపై పలుమార్లు ఫిర్యాదు అందడంతో మున్సిపల్ అధికారులు గురువారం ఉదయం మున్సిపల్ సిబ్బంది, పోలీసుల సహకారంతో చర్యలు తీసుకునేందుకు వెళ్లగా సదరు ఇంటి యజమానికి సంబంధించిన కొంతమంది మున్సిపల్ సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించడం జరిగిందని తెలిపారు. చేసేదే అక్రమ నిర్మాణం పైగా మున్సిపల్ సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించడం ఎంతవరకు సబబని పలువురు విస్మయం వ్యక్తం చేశారు.

## ఎస్సీ, ఎస్టీ నిధులు దుర్వినియోగం చేస్తే చర్యలు తప్పవు

### ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య





**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు దుర్వినియోగం చేస్తే చర్యలు తప్పవని ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అధికారులకు తెలిపారు. గురువారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్, వివిధ శాఖల ద్వారా ఎస్సీ వర్గాలకు వెచ్చిస్తున్న నిధులపై వివిధ శాఖల అధికారులతో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కిని వెంకటయ్య సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎస్సీ, ఎస్టీల సమస్యల పట్ల మానవతా దృక్పథంతో పని చేయాలన్నారు. జనాభా ప్రాతిపదికన వాటాలకు అనుగుణంగా నిధులు ఖర్చు చేయాలని అధికారులకు సూచించారు. దీర్ఘకాలికంగా పేరుకుపోయిన ఎస్సీ, ఎస్టీ భూముల సమస్యలను పరిష్కరించాలని ఆయన తెలిపారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి జూలై మాసం నుండి కార్యాచరణ రూపొందించుకొని ప్రతి నెల చివరి శనివారం పౌర హక్కుల దినాన్ని నిర్వహించి తహసిల్దార్, పోలీస్ అధికారి తప్పనిసరిగా హాజరు అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ కు సూచించారు. జిల్లాలోని సమస్యలను తెలుసుకునేందుకు వీలుగా మూడు మాసాలకు ఒకసారి డివిఎంసి సమావేశాలు నిర్వహించి సంబంధిత శాఖల అధికారులు పాల్గొని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన తెలిపారు. మూఢనమ్మకాలు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీకి సంబంధించిన చట్టాలపై అదేవిధంగా చట్టాలు అందరికీ సమానమనే విషయాన్ని అందరిలో అవగాహన కలిగేలా కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన సూచించారు. ఎస్సీ, ఎస్టీలకు సరైన న్యాయం జరిగేలా కఠోర దీక్షతో పని చేయాలని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ కాలనీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు పక్కదోవ పట్టకుండా శ్రద్ధగా పని చేయాలని అధికారులకు ఆయన సూచించారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా ఇందిరమ్మ ఇల్లు, రాజీవ్ యువ వికాస్ లలో కూడా వాటాలకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీలకు అవకాశాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ల ద్వారా వచ్చే పథకాలు అర్హులైన పేదలకు అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన సూచించారు. పదోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీలకు సరైన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, సభ్యులు లక్ష్మీనారాయణ, శంకర్, రాంబాబు నాయక్ లకు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మెమొంటోలు అందజేసి సత్కరించారు. ముందుగా రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య కొత్తగడి రెసిడెన్సీయల్ బాలికల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా, ఏవైనా సస్యాలున్నాయా అని ఆయన ఆరాతీశారు. వంట గది, స్టోర్ రూమ్ ను పరిశీలించి భోజన సదుపాయాలపై ప్రిన్సిపాల్ సాయిలత, డీఎస్సీడిఓ కమలాకర్ రెడ్డి అడిగి తెలుసుకున్నారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, ఎం.సుధీర్, డివిఎంసి సభ్యులు పెండ్యాల అనంతయ్య, గోవింద్ నాయక్, దస్తప్ప, ఎస్. రాజలింగం, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

### సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్




**చేవెళ్ల, రాజముద్ర న్యూస్ :** మున్సిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. గురువారం రోజు తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో చేవెళ్ల మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ మాట్లాడుతూ....చేవెళ్ల పురపాలక సంఘం ఏర్పడి ఆరు నెలలు గడుస్తున్నప్పటికి కార్మికులకు కనీసం గుర్తింపు కార్డు కూడా ఇవ్వలేదని అన్నారు. అలాగే జీవో నెంబర్ 60 ప్రకారం మున్సిపల్ కార్మికులకు రూ. 16,600 వేతనం, ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం, ప్రమాద బీమా కల్పించాలని మున్సిపల్ అధికారులను డిమాండ్ చేశారు. కార్మికులు విధుల సమయంలో అనేక ప్రమాదాలకు గురవుతున్నారని, అనేక మంది కార్మికులకు ఉదయం పూట కుక్కల కాటుకు గురయ్యారని, కొంతమంది కార్మికులు గాజులు, ఇనుప చువ్వలు తగిలి ప్రమాదం జరిగితే మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదానికి గురైన కార్మికులకు వైద్య ఖర్చులు మున్సిపల్ అధికారులు భరించాలని జీవో నెంబర్ 60 లో ఉందని, మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయని పక్షంలో నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు చేవెళ్ల డివిజన్ ఉపాధ్యక్షులు ముంజగల ప్రభుదాస్, చేవెళ్ల పట్టణ కార్యదర్శి సిహెచ్ నరేష్, మున్సిపల్ యూనియన్ నాయకులు దస్తగిరి, జనార్ధన్, నరసింహ, భాస్కర్, మహమ్మద్ రఫీ, మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



## రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా నోట్ బుక్స్ పంపిణీ

**వలిగొండ రాజముద్ర న్యూస్:** భావి భారత ప్రధాని భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ లోక్ సభ ఫ్లోర్ లీడర్ రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు వలిగొండ (మల్లేపల్లి)లో యూత్ కాంగ్రెస్ వలిగొండ మండల అధ్యక్షులు మైసోళ్ళ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. అదేవిధంగా మల్లేపల్లి గ్రామంలో ప్రాథమిక కోన్నత పాఠశాల పిల్లలకు నోట్ బుక్స్, పెన్నులు, పండ్లు పంపిణీ చేయటం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి పరిపాలనలో భువనగిరి ఎంతో అభివృద్ధి చెందుతుందని భువనగిరి నియోజకవర్గంలో ప్రతి పాఠశాలకు ఎన్నో అభివృద్ధి పనులు చేస్తున్నారు అని పిల్లలకు వివరించటం జరిగింది. విద్యార్థిని విద్యార్థులు ముందు ముందు ఇంకా పై చదువులు చదువుకొని మంచి ఉన్నత స్థాయిలో ఉండాలని కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో వలిగొండ ఎం ఈ ఓ సుంకోజు భాస్కర్, పాఠశాల చైర్మన్ సుంకోజు చంద్రమౌళి ఉపాధ్యాయులు కిరణ్, అసెంబ్లీ యూత్ ప్రధాన కార్యదర్శి బుగ్గ ఉదయ్,యూత్ మండల ఉపాధ్యక్షులు మచ్చగిరి మండల యూత్ ప్రధాన కార్యదర్శి తోట సాయి,సోమేశ్, అరుణ్,దుర్గ, వినోద్,బిక్షపతి,భార్గవ్, రవి యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**ఆత్మకూర్ (ఎం) రాజముద్ర న్యూస్ :** గురువారం జూన్ 19న భావి భారత ప్రధాని భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ లోక్ సభ ఫ్లోర్ లీడర్ రాహుల్ గాంధీ జన్మదినోత్సవ వేడుకల సందర్భంగా ఆత్మకూరు ఎం మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్టింగ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు యాస లక్ష్మారెడ్డి పిఎసిఎస్ చైర్మన్ జిల్లాల శేఖర్ రెడ్డి,మాజీ జెడ్పిటిసి నరేందర్ గుప్తా, వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దసాని సిద్దులు, ప్రధాన కార్యదర్శి కందడి అనంతరెడ్డి, స్థానిక మాజీ సర్పంచ్ జన్నాయికోడే నగేష్, పట్టణ అధ్యక్షుడు పోతగాని మల్లేష్ గౌడ్, పిఎసిఎస్ డైరెక్టర్ నోముల వెంకట్ రెడ్డి బీసీ సెల్ కట్టెకోల హన్మంతు గౌడ్,యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ చిత్తార్ల అనిల్ గౌడ్, ఎన్ ఎస్ యు ఐ ప్రెసిడెంట్ యాస సుభాష్ రెడ్డి నాయకులు తండా శ్రీశైలం భాషబోయిన పాపయ్య యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ చిత్తార్ల అనిల్ గౌడ్, ఎన్ ఎస్ యు ఐ ప్రెసిడెంట్ యాస సుభాష్ రెడ్డి,ఎద్దు వెంకన్న ఎలాగందుల శ్రీనివాస్, కొండపల్లి ముత్యాలు, కోరే మల్లేష్, మల్లేష్ పాశం అనంతరెడ్డి, యాస సంజీవరెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

www.rajamudranews.com
అక్షర రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక



## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**శేరిలింగంపల్లి,రాజముద్ర న్యూస్:** రాహుల్ గాంధీ జన్మదిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రెటరీ ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, గ్రేటర్ హైదరాబాద్ స్టాండింగ్ కమిటీ సభ్యుడు జగదీశ్వర్ గౌడ్ అద్వర్యంలో చందా నగర్ అంబేద్కర్ సర్కిల్ వద్ద నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ జాతీయ మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీ జన్మదిన సందర్బంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానుల మద్య కేక్ కట్ చేసి, పెద్దలకు పండ్లు పంపిణీ చేసారు. ఈకార్యక్రమంలో మియాపూర్ 108 డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు తాండ్ర రాంచందర్ గౌడ్, మన్నెపల్లి సాంబశివరావు, గంగారం సంగారెడ్డి, మియా పూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ దోర్నాల రవికుమార్, సురేష్ యాదవ్, సత్యరాజ్ తదితరులు పాల్గొన్నారు.



## బాలానగర్‌లో బండి రమేష్ పర్యటన

**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్ :** కూకట్ పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్ లో టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ గురువారం నియోజకవర్గం లోని సమస్యల పరిష్కార కోసం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా బాలానగర్ డివిజన్ రాజీవ్ గాంధీ నగర్ ఎన్టీఆర్ నగర్ లో స్థానిక నాయకులతో కలిసి అభివృద్ధి పనులను పరిశీలించారు. అదేవిధంగా స్థానికంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను కబ్జాకు గురి కాకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని రమేష్ ఎమ్మార్వో, డిప్యూటీ కమిషనర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, మార్కెటింగ్ కమిటీ చైర్మన్ పుష్పా రెడ్డి, వైస్ చైర్మన్ ప్రకాష్, పులి శ్రీకాంత్ పటేల్, పులి శివకుమార్ గౌడ్, బాల నరసింహ, పప్పు, హుస్సే న్, శ్రీనివాస్, మహేందర్, సుధాకర్ రెడ్డి, హర్షత్ సోను, జమ్మూ, నరేష్, ఆర్. సురేందర్, సలీం, శంకర్ గౌడ్, అనిల్, వహాజ్, నాయకులు కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## గురుకుల పాఠశాల తనిఖీ

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** గురువారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని కొత్తగాడి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ .బక్కి వెంకటయ్య తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థిని పట్ల దూషించి, కొట్టిన విషయం తెలిసి పాఠశాల ప్రిన్సిపాల్ ను ఇకమీదట ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకూడదని సూచించారు. పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతూ విద్యాబోధన, ఆహారం పట్ల ఇతర వసతుల పట్ల ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు వడ్డించే భోజనం నాణ్యతనంగా, వంటశాల పరిశుభ్రంగా ఉంచుతున్నారా లేదా అని పరిశీలించారు. విద్యార్థులను బాగా చదివి ఉన్నత స్థాయిలో నిలిచి, తల్లితండ్రులకు, అధ్యాపకులకు,పాఠశాలకు గొప్ప పేరు ప్రఖ్యాతులు సంపాదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు కొంకటి లక్ష్మీనారాయణ, శంకర్, రాంబాబు నాయక్, జాతీయ దళిత బహుజన ఫ్రంట్ ప్రధాన కార్యదర్శి శంకర్, పాఠశాల ప్రధానోపాధ్యులు, ఉపాధ్యాయులు,ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ముదురుతున్న యుద్ధం..

### ఇరాన్ నోట 'హర్మూజ్' మూసివేత ప్రస్తావన




**ఇరాన్ :** ఇజ్రాయెల్–ఇరాన్ యుద్ధం తీవ్ర రూపం దాల్చుతున్న నేపథ్యంలో ఇరాన్ కీలక వ్యాఖ్యలు చేసింది. హర్మూజ్ జలసంధిని కూడా మూసివేసే ఆప్షన్ తమ వద్ద ఉందని వెల్లడించింది. శత్రువులపై ప్రతీకారం తీర్చుకునేందుకు ఈ జలస ంధిని మూసివేయడం కూడా ఓ మార్గమని ఇరాన్ పార్లమెంట్ జాతీయ భద్రతా కమిటీ సభ్యుడు బెహ్నాం సయీదీ గురువారం మీడియాకు తెలిపారు. పాశ్చాత్య దేశాలు తీవ్రంగా ఒత్తిడి చేసిన సమయంలో గతంలోనూ హర్మూజ్ జలసంధిని మూసివేస్తామని ఇరాన్ బెదిరించింది. ప్రపంచ వ్యాప్తంగా రోజువారీ చమురు అవసరాల్లో 20శాతం హర్మూజ్ ద్వారానే రవాణా అవుతోంది. ప్రపంచ చమురు మార్కెట్‌కు హర్మూజ్ జలసంధి జీవనాడి. అరేబియా సముద్రంలో ఒమన్‌కు చెందిన ముసాండం ద్వీపకల్పం–ఇరాన్ మధ్య ఉన్న అత్యంత ఇరుకైన జలసంధి ఇది. దీనిలో ఓ చోట అత్యంత ఇరుకుగా కేవలం 33 కిలోమీటర్లు మాత్రమే ఉంటుంది. ఈ మార్గం నుంచి నిత్యం 2 కోట్ల పీపాల చమురు వివిధ దేశాలకు వెళుతుంది. సౌదీ, ఇరాన్, యూఏఈ, కువైట్, ఇరాక్‌ల నుంచి ఎగుమతి అవు తోంది. ఇక లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ రవాణాకు కూడా అత్యంత కీలకం. మూ డింట ఒకవంతు ఎల్ఎన్‌జీ కూడా ఇక్కడినుంచే వివిధ దేశాలకు చేరుతుంది.

### బుషెహర్ అణు విద్యుత్ కేంద్రంపై దాడులు ఆపాలి : రష్యా

ఇరాన్‌లోని బుషెహర్ అణువిద్యుత్ కేంద్రంపై ఇజ్రాయెల్ దాడులకు పాల్పడు తున్న నేపథ్యంలో రష్యా స్పందించింది. తక్షణమే దాడులను ఆపాలని ఆ దేశానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు రష్యా విదేశాంగశాఖ మంత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. పర్షియన్ గల్ఫ్‌లోని బుషెహర్ ప్రాంతంలో ఈ అణు విద్యుత్ కేంద్రం ఉంది. ఇరాన్ ఏర్పాటు చేసుకున్న ఒకే ఒక వాణిజ్య స్థాయి అణు విద్యుత్ కేంద్రమిది. ఇది టెహ్రాన్ నగరానికి 750 కిలోమీటర్ల దూరంలో ఉంది. దీని నిర్మాణంలో ఇరాన్‌కు రష్యా సాయమందించింది. రష్యాలో ఉత్పత్తి అయిన యురేనియం ఈ అణు విద్యుత్ కేంద్రానికి ఇంధనంగా ఉపయోగపడుతోంది.

# పేదల సొంతింటి కలలు నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

- అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ అభివృద్ధి ఫలాలు
- రాజకీయాల కతీతంగా అభివృద్ధి
- పేదలు కడుపునిండా తినాలని సన్న బియ్యం పంపిణీ
- అనంతగిరి పర్యాటక అభివృద్ధికి 1000 కోట్లు
- మెగా సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్న ప్రభుత్వం
- తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్





**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ స్పష్టం చేశారు. గురువారం వికారాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వికారాబాద్ పట్టణం, మండలానికి సంబంధించిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేసే కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి, వికారాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొన్నారు. ఇందులో భాగంగా వికారాబాద్ పట్టణానికి చెందిన 359 మంది, వికారాబాద్ మండలానికి చెందిన 254 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా సభాపతి ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ... అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందేలా కృషి చేస్తున్నామన్నారు. దేశంలో పేదల కోసం కూడు, గుడ్డ, గుడ్డ కల్పించాలనే లక్ష్యంతో నాటి ప్రధానమంత్రి స్వర్గీయ ఇందిరాగాంది దేశ ప్రజలకు ఎంతో సేవ చేశారని సభాపతి అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం కూడా అదే ఆశయంతో పనిచేస్తుందని ఆయన తెలిపారు. అందుకే రాష్ట్రంలోని పేదల కోసం ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేయడం జరిగిందని, మంజూరైన వాళ్ళు వెంటనే పనులను మొదలు పెట్టి పూర్తి చేసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన బిల్లులు ఎప్పటికప్పుడు మధ్యవర్తుల ప్రమేయం లేకుండా మొత్తం నాలుగు విడతల్లో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలోనే డబ్బులు జమ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. బేస్మెంట్ గాని గోడలు గాని శ్లాబ్‌గాని నిర్మాణం పూర్తిచేసుకుంటే అధికారుల కోసం ఎదురుచూడకుండా లబ్దిదారులే ఫోటో తీసి మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేసినా కూడా డబ్బులు లబ్దిదారుల ఖాతాలో వేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ ఏడాది నాలుగు లక్షల యాబై వేల ఇళ్ళ నిర్మాణానికి రాష్ట్ర బడ్జెట్లో 22 వేల 500 కోట్లను కేటాయించడం జరిగిందని, విడతల వారిగా రాష్ట్రంలోని పేదలందరికి ఇందిరమ్మ ఇళ్ళు వస్తాయని ఆయన తెలిపారు. స్పీకర్ హోదాలో ఉండడంతో వికారాబాద్ నియోజకవర్గానికి ప్రత్యేకంగా 7000 ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని , మన నియోజకవర్గంలో కూడా స్వంత ఇల్లు లేని పేదలందరికి ఏడాదికి కొంతమందికి చొప్పున అందరికి ఇళ్ళను మంజూరు చేయిస్తామని ఆయన తెలిపారు. ఓట్లు వేసిన, వేయనోళ్ళ అనే బేధం లేకుండా రాజకీయాలకు అతీతంగా పేదల అందరికీ సంక్షేమ కార్యక్రమాలు అందుతాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు బాగుంటే అందరికి ఒకేసారి ఇచ్చేవాళ్ళం కానీ గత ప్రభుత్వం చేసిన 8 లక్షల 20 వేల కోట్ల అప్పులకు మిత్తీలు, అసలు వాయిదాలు కట్టడానికే రాష్ట్ర బడ్జెట్లో సగం పోతుందని ప్రజలు అర్థం చేసుకోవాలని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన అంశాలతో పాటుగా ఇవ్వని హామీలను కూడా చేపట్టడం జరుగుతుందని ఆయన అన్నారు. పేదలు తృప్తిగా కడుపు నిండా అన్నం తినాలనే మంచి ఆశయంతో దేశంలోనే మొదటి సారిగా మన తెలంగాణ రాష్ట్రంలో సన్న బియ్యాన్ని రేషన్ షాపుల ద్వారా అందిస్తున్నట్లు సభాపతి తెలిపారు. రాష్ట్రంలో 90 లక్షల కుటుంబాలలో సన్న బియ్యంతో అన్నం తింటున్నారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమం, రైతుల అభివృద్ధి కోసం అధికంగా నిధులను కేటాయిస్తుందని, ప్రజా ప్రభుత్వం వచ్చిన గత 18 నెలల లోనే వ్యవసాయ రంగానికి లక్ష కోట్లు ఖర్చు చేసిందని ఆయన తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల కాలంలోనే 25 లక్షల మంది రైతులకు 22 వేల కోట్ల రుణమాఫీ చేసిందని స్పీకర్ తెలిపారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలు అందరు ఆర్టిసి బస్సులలో ఉచితంగా ప్రయాణిస్తున్నారని ఆయన తెలిపారు. 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడుకునే వారు రాష్ట్రంలో యాబై లక్షల పేదల కుటుంబాలకు గృహజ్యోతి పథకం ద్వారా ఉచితంగా కరంటు సరఫరా అవుతున్నదని ఆయన తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని ఐదు లక్షల నుంచి 10 లక్షలకు పెంచామని, 500 రూపాయలకే సబ్సిడీ గ్యాస్ సిలిండర్ ను అందిస్తున్నామని ఆయన తెలిపారు. ప్రభుత్వ హాస్టళ్లలోని పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని 40 శాతం డైట్ చార్జీలు 200 శాతం కాస్మోటిక్ చార్జీలు పెంచామని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం సన్న వడ్లకు క్వింటాలుకు 500 రూపాయల బోనస్ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. పేదల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను క్షేత్ర స్థాయిలో అమలు చేసే బాధ్యత ప్రభుత్వ ఉద్యోగులదని ప్రభుత్వ ఉద్యోగులు పేదలకు సేవాభావంతో పనిచేయాలని సభాపతి సూచించారు. డ్యూటీ మైండెడ్ కాకుండా పేదల కష్టాలు తొలగించాలనే దృక్పథంతో ఎల్లప్పుడూ అందుబాటులో అధికారులు ఉండాలని ఆయన సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులతో స్నేహ పూర్వకంగా ఎల్లప్పుడు తోడుగా ఉంటుందని ఆయన చెప్పారు. ఒక్క ఏడాదిలోనే 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని చెప్పారు. వానాకాలం పంటల సాగుకు రైతు భరోసా డబ్బులు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నామన్నారు. నిన్నటి వరకు నాలుగు ఎకరాల వరకు రైతులకు అందాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడి హామీ ఇచ్చిన విదంగా తొమ్మిది రోజులలో తొమ్మిది వేల కోట్ల రూపాయలు రైతులకు అందుతాయని ఆయన తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సహకారంతో వికారాబాద్ నియోజకవర్గం అభివృద్ధి కోసం కావలసిన నిధులను మంజూరు చేయిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి గ్రామంలో 60 లక్షల నుండి కోటి రూపాయలతో సిసి రోడ్లను వేయించామని సభాపతి తెలిపారు. వికారాబాద్ నియోజకవర్గంలో పెద్ద ఎత్తున ఉన్న భూములలో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నామని, పరిశ్రమల ఏర్పాటుతో స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు అందుతాయని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతగిరిని పర్యాటకంగా వెయ్యి కోట్లతో అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం మెగా సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నదని, ఈ ప్రాజెక్టుతో యువతకు కూడా పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనునట్లు ఆయన పేర్కొన్నారు. ముందుగా తహసిల్దార్ కార్యాలయం ఆవరణలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతుల సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇందిరమ్మ మహిళా శక్తి మన దుకాణం స్టాల్ ను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తో కలిసి సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ప్రారంభించారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ సుధీర్, ఆర్డిఓ వాసు చంద్ర, డిఆర్డిఓ శ్రీనివాస్, హౌసింగ్ పీడీ కృష్ణయ్య, తహసిల్దార్ లక్ష్మీనారాయణ, డిసిసిబి డైరెక్టర్ కిషన్ నాయక్, ఆర్టిఏ సభ్యులు జాఫర్, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## సిపిఐ మండల మహాసభను జయప్రదం చేయండి



**ఆత్మకూర్(యం) రాజముద్ర న్యూస్:** ఈ నెల జూన్ 25 న జరిగే భారత కమ్యూనిస్టు పార్టీ మండల13వ మహాసభను జయప్రదం చేయాలని సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పుల ముత్యాలు,మండల కార్యదర్శి మారుపాక వెంకటేశం కోరారు.గురువారం మండల కేంద్రంలో మహాసభ కరపత్రం విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ పేదల పక్షాన ఉండి పేదల సమస్యల కోసం పోరాటం చేస్తుందన్నారు.మండల పరిధిలోని బునాదికాలను పూర్తిచేసి రైతులకు సాగునీరు అందించాలని,మండల కేంద్రం లో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని,30 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేసి 24 గంటల సేవలు అందించాలని కోరారు.మండల కేంద్రంలో మినీ స్టేడియం మంజూరు చేయాలని,రాయిపల్లి, మొరిపిరాల,కొరటికల్, రహీంఖాన్ పేట్ పోతిరెడ్డిపల్లి ,కూరెళ్ళ బిక్కేరు వాగులపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలన్నారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి మారుపాక వెంకటేశం ,సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు జెల్ది రాములు,జక్కా దయాకర్ రెడ్డి, సోలిపురం లింగారెడ్డి,కసరబోయిన సత్తయ్య, బొబ్బల లాల్ రెడ్డి, కల్వల నర్సయ్య, సిపిఐ మండల నాయకులు సుల్తాన్ పురుషోత్తం, అంబోజు రాములు, జెల్ది వజ్రమ్మ,మజ్జిగ నరసయ్య, బుర్ర ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతి రెవెన్యూ సదస్సులలో దరఖాస్తు ఇచ్చిన

# ప్రతి రైతు సమస్యను పరిష్కరించాలి

- గ్రామ సభలలో దరఖాస్తు చేసుకోని వారికి మరోసారి దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించాలి
- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహ



**యాదాద్రి భువనగిరి రాజముద్ర న్యూస్ :** భూభారతి రెవెన్యూ సదస్సులో వివిధ సమస్యలపై దరఖాస్తు పెట్టుకున్న ప్రతి రైతు సమస్యను పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వివిధ కారణాల చేత భూభారతి గ్రామ సదస్సులో పాల్గొనక దరఖాస్తు చేసుకొని వారికి కూడా దరఖాస్తును పెట్టుకోవడానికి మరో మారు అవకాశం కల్పించాలని ప్రభుత్వానికి సూచించారు. గురువారం భువనగిరి మండలం రాయగిరి రెవెన్యూ పరిధిలోని ముత్తిరెడ్డిగూడెం, గంగసాని పల్లి, వడాయి గూడెం, జమ్మాపురం, రాయగిరి గ్రామాలకు సంబంధించిన భూభారతి సదస్సు రాయగిరిలో నిర్వహించగా రైతులకు సంబంధించిన వివిధ సమస్యలపైన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో భువనగిరి తహాశీల్దార్ అంజిరెడ్డి కి మెమోరండం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ గత 50, 60 సంవత్సరాలుగా అనేకమంది దళితులు, గిరిజనులు, పేదలు ప్రభుత్వ భూములను పెద్ద ఎత్తున సాగు చేసుకుంటున్నారని, ఆ భూముల ఆధారంగా తమ కుటుంబాలను పోషించుకుంటున్నారని అన్నారు. కానీ కొందరికి పట్టాలు ఇచ్చారని, కొందరికి నేటికీ ఇవ్వలేదని తెలిపారు. చాలా గ్రామాలను ఉమ్మడి కుటుంబాలు ఉన్నప్పుడు కుటుంబంలోని పెద్ద వారి పేరుతో పట్టా సర్టిఫికెట్స్ ఇచ్చారని కానీ నేడు ఆ కుటుంబాలు సంవత్సరాలు గడుస్తున్న కొద్ది విభజన జరిగాయని భూమి అందరు చేసుకుంటూ బతుకుతున్నారు తప్ప ఒకరి పేరు మీదనే భూమి ఉండడం వారికే పట్టాదారు పాస్బుక్ ఉండడంవల్ల మిగతా కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయని ఇప్పటికైనా ప్రభుత్వం భూమి సేద్యం చేసుకుంటున్న వారందరికీ పట్టా సర్టిఫికెట్లు, నూతన పాస్ బుక్కులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భువనగిరి మండలంలో భూ పంపిణీ నిషేధం పేరుతో సేద్యం చేసుకుంటున్న ప్రభుత్వ భూములకు కూడా పట్టాదారు పాస్ బుక్కులు ఇవ్వడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ధరణి చట్టం పేరుతో పేదలను అనేటి ఇబ్బందులు పెట్టిందని గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్ది ఈ ప్రభుత్వము భూభారతి చట్టంలో పేదలు ఎదుర్కొంటున్న ప్రతి భూ సమస్యను పరిష్కరించాలని కోరారు. భూ సమస్యలపై స్వీకరిస్తున్న దరఖాస్తులను నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని సూచించారు. ఈ సదస్సులలో అసైన్మెంట్ భూముల, డి.ఫారెస్ట్ భూముల, రాచకొండ భూముల, కాంధీ షీకుల భూముల, వక్ భూముల సమస్యలను కూడా పరిష్కరించాలని ప్రభుత్వాన్ని నర్సింహ కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో రైతులు కూకుట్ల శ్రీశైలం, కొండమడుగు చంద్రయ్య, గౌరయ్య, కృష్ణ, బాలరాజు, స్వామి, వెంకట్ రెడ్డి, మహేందర్ రెడ్డి, సత్తయ్య తో పాటు వివిధ గ్రామాలకు సంబంధించిన రైతులు పాల్గొన్నారు.





## క్షిపణులను చూశాం..

### బాంబుల శబ్దం ఇప్పటికీ ధ్వనిస్తోంది

#### : భయానక అనుభవాలు పంచుకున్న విద్యార్థి

**న్యూఢిల్లీ :** "క్షిపణులు దూసుకొస్తున్నాయి. బాంబుల మోత భయపడుతోంది. అదో భయంకరమైన కాళరాత్రి. ఏం జరుగుతుందో తెలియక, ఏం చేయాలో పాలుపోక బొమ్మల్లా నిల్చుండి పోయాం" అని ఇరాన్‌లోని భారతీయ విద్యార్థులు వారు ఎదుర్కొన్న భయానక పరిస్థితిని వివరించారు. ఇరాన్‌లో చిక్కుకు పోయిన భారతీయులను వెనక్కి రప్పించేందుకు కేంద్రం 'ఆపరేషన్ సింధు'ను ప్రారంభించిన సంగతి తెలిసిందే. తొలిసారిగా ఊర్మియా యూనివర్సిటీకి చెందిన 90 మంది మెడికల్ విద్యార్థులతో సహా 110 మంది దిల్లీ చేరుకున్నారు. తొలుత టెహ్రాన్ నుంచి పొరుగుదేశం అర్మేనియాకు వెళ్లి.. అక్కడి నుంచి స్వదేశానికి పయనమయ్యారు. దిల్లీలో దిగిన మీర్ ఖలీఫ్ అనే ఎంబీబీఎస్ విద్యార్థి మీడియాతో మాట్లాడుతూ.. "క్షిపణులు, బాంబులను ప్రత్యక్షంగా చూశాం. బాంబు దాడుల తీవ్రతకు భవనాలు కంపించిపోయాయి. అక్కడ భయానక వాతావరణం ఉంది. ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో మా పక్క భవనంలో నివసిస్తున్న ఓ వ్యక్తి చనిపోయాడు. ఇంకా చాలా మంది భారతీయ విద్యార్థులు అక్కడ చిక్కుకున్నారు. వారంతా తొందర్లోనే స్వదేశానికి రావాలి. ఇరాన్‌లో ఉన్నవారిని రప్పించేందుకు భారత ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోంది. ఇండియన్ ఎంబసీ మమ్మల్ని సంప్రదించిన తర్వాతే ఇంటికి చేరగలమన్న నమ్మకం ఏర్పడింది. మీడియాలో కనిపిస్తున్న దృశ్యాలు యదార్థం. అక్కడ భీతావహ పరిస్థితులు ఉన్నాయి." అని పేర్కొన్నారు.

### మిగతావారినీ రప్పిస్తాం: కీర్తి వర్ధన్ సింగ్

ఇరాన్ నుంచి భారత్‌కు చేరుకున్న వైద్య విద్యార్థులకు కేంద్ర మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ స్వాగతం పలికారు. దిల్లీ ఎయిర్‌పోర్టుకు వెళ్లి.. వారితో నేరుగా మాట్లాడారు. అక్కడి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మిగతా వారిని కూడా స్వదేశానికి రప్పించేందుకు కేంద్రం తీవ్ర కసరత్తు చేస్తోందని చెప్పారు. తుర్క్మెమిస్థాన్ మీదుగా మరికొందర్ని రప్పించేందుకు ఇప్పటికే విమానాలు సిద్ధం చేసి ఉంచినట్లు చెప్పారు. అవసరమైన అనుమతులు రాగానే కార్యాచరణ అమలు చేస్తామన్నారు.

## లాడెన్‌ను అప్పుడే మరచిపోయారా?

### మునీర్‌కు ట్రంప్ విందుపై శశిథరూర్

**న్యూఢిల్లీ :** పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసీం మునీర్‌కు డొనాల్డ్ ట్రంప్ విందు ఇవ్వడంపై కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ తీవ్ర విమర్శలు గుప్పిం చారు. ఒసామా బిన్ లాడెన్‌కు ఆశ్ర యం కల్పించడంలో పాక్ పాత్రను అమెరికా మరచిపోకూడదన్నారు. "వర ల్డ్ ట్రేడ్ సెంటర్ దాడిలో ప్రధాన సూత్ర ధారి ఒసామా బిన్ లాడెన్ ఎపిసోడ్‌ను పాక్ బృందాన్ని కలిసిన కొంతమంది చట్టసభ సభ్యులు మరచిపోయినప్పటికీ అమెరికా ప్రజలు మాత్రం అంత తొందరగా మరచిపోలేరు. ఇటువంటి వ్యక్తి దొరికేవరకు.. ఓ ఆర్మీ క్యాంపు దగ్గర పాక్ దాచిపెట్టిన విషయాన్ని అమెరికన్లు అంత తొందరగా మరచిపోరు" అని శశిథరూర్ పేర్కొన్నారు. ఉగ్రవాదులకు శిక్షణాపరంగా, ఆర్థికంగా మద్దతు ఇవ్వకూడదనే విషయాన్ని పాకిస్థాన్‌కు అమెరికా అధ్యక్షుడు ఈ సందర్భంగా హెచ్చరించి ఉంటారని ఆశిస్తున్నట్లు చెప్పారు.

### భిన్నాభిప్రాయాలు నిజమే : థరూర్

కాంగ్రెస్ అగ్రనాయకత్వంలో కొందరితో తనకు భిన్నాభిప్రాయాలు ఉన్న మాట వాస్తవమేనని ఆ పార్టీ సీనియర్ నేత శశి థరూర్ అంగీకరించారు. అయితే, వాటిని పార్టీ అంతర్గత సమావేశంలోనే చర్చిస్తానని అన్నారు. ఆపరేషన్ సిందూర్‌పై ఏర్పాటైన ఓ అఖిలపక్ష బృందానికి నాయకత్వం వహించిన థరూర్.. ప్రధాని మోదీని కలిసిన సందర్భంలో పర్యటన గురించి తప్ప వేరే విషయాలేవీ చర్చించలేదని స్పష్టం చేశారు.

# హెడింగ్లీలో టీమ్ఇండియా రికార్డ్ ఎలా ఉందంటే?

ఇంగ్లండ్, టీమ్ఇండియా మధ్య జూన్ 20 నుంచి అయిదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ ప్రారంభం కానుంది. మొదటి మ్యాచ్ లీడ్స్‌లోని హెడింగ్లీ వేదికగా జరగనుంది. భారత్ ఈ వేదికలో చాలా తక్కువ మ్యాచ్‌లు ఆడింది. ఇప్పటి వరకు ఇక్కడ ఏడు మ్యాచ్‌ల్లో టీమ్ఇండియా, ఇంగ్లండ్ తలపడితే కేవలం రెండుసార్లు మాత్రమే భారతజట్టు విజయం సాధిం చింది. ఓ మ్యాచ్ డ్రా చేసుకుంది. హెడింగ్లీలో టీమ్ఇండియా చివరి సారి 22 ఆగస్టు 2002లో ఇన్నింగ్స్ 46 పరుగుల తేడాతో విజయం సాధించింది. అంతకు ముందు 19 జూన్ 1986లో 279 పరుగుల తేడాతో గెలిచింది. హెడింగ్లీ వేదికగా ఇంగ్లండ్, టీమ్ఇండియా మొదటి సారి 5 జూన్ 1952లో తలపడితే, చివరిసారి 25 ఆగస్టు 2021లో పోటీపడ్డాయి.



### గంగూలీ సారథ్యంలో..

2002లో ఆగస్టు 22 నుంచి 26 మధ్య సౌరభ్ గంగూలీ కెప్టెన్సీలో భారత సేన ఈ మైదానంలో ఇంగ్లండ్‌తో తలపడింది. తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్ఇండియా తన మొదటి ఇన్నింగ్స్‌ను 628/8 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. సచిన్ తెండుల్కర్ 193, రాహుల్ ద్రవిడ్ 148, సౌరభ్ గంగూలీ 128 పరుగులు చేశారు. ఓపెనర్ సంజయ్ బంగర్ 68 రన్స్ సాధించాడు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన ఇంగ్లండ్ 273 పరుగులకే ఆలౌటైంది. టీమ్ఇండియా బౌలర్లలో అనిల్ కుంబ్లే, హర్భజన్ సింగ్ తలో 3, జహీర్ ఖాన్, అజిత్ అగార్కర్ చెరో 2 వికెట్లు తీసుకున్నారు. ఫాలో ఆన్ ఆడిన ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 309 పరుగులకు ఆలౌటైంది. అనిల్‌కుంబ్లే 4, సంజయ్ బంగర్ 2, జహీర్ ఖాన్, అజిత్ అగార్కర్, హర్భజన్ సింగ్ తలో వికెట్ తీసుకున్నారు. ఈ మ్యాచ్‌లో భారత్, ఇంగ్లండ్‌పై ఇన్నింగ్స్, 46 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్‌గా రాహుల్ ద్రవిడ్ నిలిచాడు.

### విరాట్ కోహ్లీ కెప్టెన్సీలో..

2021 ఆగస్టు 25 నుంచి 28 మధ్య విరాట్ కోహ్లీ కెప్టెన్సీలో టీమ్ఇండియా లీడ్స్‌లో ఇంగ్లండ్‌తో టెస్ట్ మ్యాచ్ ఆడింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 78 పరుగులకే కుప్పకూలింది. రోహిత్ శర్మ 19 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. తర్వాత బ్యాటింగ్ ప్రారంభించిన ఇంగ్లండ్ 432 పరుగులకు ఆలౌటైంది. మొదటి ఇన్నింగ్స్‌లో జోరూట్ 121 పరుగులు చేశాడు. తర్వాత రెండో ఇన్నింగ్స్‌లో ఛతేశ్వర్ పుజారా 91, రోహిత్ శర్మ 59, విరాట్ కోహ్లీ 55 పరుగులు చేశారు. భారత్ 278 పరుగులకు ఆలౌటైంది. ఈ మ్యాచ్‌లో టీమ్ఇండియా ఇన్నింగ్స్ 76 పరుగుల తేడాతో ఓటమి చవిచూసింది. ఇక ప్రస్తుతం టెస్ట్ క్రికెట్‌కు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ తమ రిటైర్మెంట్లు ప్రకటించిన నేపథ్యంలో భారత జట్టు నూతన కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నేతృత్వంలో హెడింగ్లీ మైదానంలో ఇంగ్లండ్‌తో తలపడనుంది.

## కొత్త రికార్డు సృష్టించిన ఐపీఎల్ 2025 ఫైనల్



ఐపీఎల్ 2025లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే. అహ్మదాబాద్ వేదికగా పంజాబ్ కింగ్స్‌తో జరిగిన ఫైనల్‌లో 6 పరుగుల తేడాతో గెలిచిన ఆర్సీబీ తొలిసారి టైటిల్‌ను ముద్దాడింది. కోట్లాది అభిమాన గణం ఉన్న ఆర్సీబీ జట్టు చాలా ఏళ్ల తర్వాత ఫైనల్‌కు చేరడం, మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగడంతో ఈ సారి ఫైనల్‌కు రికార్డుస్థాయిలో వీక్షణలు వచ్చాయి. ఈ సీజన్‌లో టీవీ, డిజిటల్ ప్లాట్‌పామ్స్‌లో కలిపి మొత్తం మ్యాచ్‌లకు 840 బిలియన్ల నిమిషాల వీక్షణలు వచ్చాయని ప్రసారదారు జియోస్టార్ ప్రకటించింది. ఇక, ఐపీఎల్ 2025 ఫైనల్ మ్యాచ్ అత్యధికమంది వీక్షించిన టీ20 మ్యాచ్‌గా రికార్డు సృష్టించింది. ఈ మ్యాచ్‌కు టీవీ, డిజిటల్ ప్లాట్‌పామ్స్‌లో కలిపి ఏకంగా 31.7 బిలియన్ల వీక్షణలు వచ్చినట్లు సమాచారం. ఫైనల్‌ను టీవీలో 169 మిలియన్ల మంది వీక్షించగా.. డిజిటల్‌లో 892 మిలియన్ వీడియో వ్యూస్‌తో కొత్త బెంచ్‌మార్క్‌ను నమోదు చేసింది. మ్యాచ్‌ను ఒకదశలో అత్యధికంగా 55 మిలియన్ల మంది వీక్షించారు. జియోస్టార్ గత సంవత్సరంతో పోలిస్తే డిజిటల్ వీక్షణల్లో 29 శాతం పెరుగుదలను నమోదుచేసింది. ఎక్కువ మంది అభిమానులు పెద్ద స్క్రీన్లలో మ్యాచ్‌లను చూడటానికి ఆసక్తి చూపించారు. టీవీలో స్టార్ స్పోర్ట్స్ 456 బిలియన్ నిమిషాల లైవ్ కవరేజీని అందించింది. ఐపీఎల్ చరిత్రలో ఇదే అత్యధికం.

## బుమ్రా వరల్డ్ క్లాస్ బౌలరే.. కానీ : బెన్ స్టోక్స్

ఇంగ్లండ్, టీమ్ఇండియాల మధ్య రేపటి నుంచి (జూన్ 20) అయిదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ ప్రారంభం కానుంది. ఈనేపథ్యంలో భారత ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా గురించి ఇంగ్లండ్ కెప్టెన్ బెన్‌స్టోక్స్ మాట్లాడాడు. బుమ్రా వరల్డ్‌క్లాస్ బౌలరే అయినప్పటికీ, అతడొక్కడే సిరీస్‌ను ఒంటి చేత్తో గెలిపించలేడన్నాడు. అలాగే తమ జట్టు ఆటగాళ్లు ఏ జట్టుకూ, ఏ ఆటగాడికి కూడా భయపడరన్నారు. వారంతా అంతర్జాతీయ క్రికెట్‌లో బలమైన ప్రత్యర్థులను ఎదుర్కొన్నారని కొనియాడాడు. 'అంతర్జాతీయ క్రికెట్‌లో భయం అనేది ఉండదు. అక్కడ బలమైన ప్రత్యర్థులను ఎదుర్కొనే ఉంటారు. మాకు బుమ్రా క్లాస్ తెలుసు. అతడు తన టీమ్ కోసం ఏం చేయగలడో కూడా మాకు అవగాహన ఉంది. కానీ మాకు అతడంటే భయం లేదు. కేవలం ఒక్క బౌలరే సిరీస్‌ను గెలిపిస్తాడు అని నేను అనుకోవడం లేదు. మొత్తం 11 మంది ఆటగాళ్లు సమష్టిగా రాణిస్తేనే విజయం వరిస్తుంది. ఒక్కరి వల్ల మాత్రం కచ్చితంగా విజయం సాధ్యం కాదు' అని బెన్‌స్టోక్స్ వివరించాడు.





## ఆధార్ ఉంటేనే తత్కాల్ టికెట్..

**న్యూఢిల్లీ :** తత్కాల్ టికెట్ బుకింగ్‌కు సంబంధించి జులై 1 నుంచి కొత్త రూల్స్ అమల్లోకి రానున్నాయి. ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్, మొబైల్ యాప్‌లో ఆధార్ అథంటికేషన్, కేవైసీ పూర్తి చేసిన వ్యక్తులు మాత్రమే టికెట్ బుక్ చేసుకునే వీలుంది. అంతేకాదు జులై 15 నుంచి టికెట్ బుకింగ్ సమయంలో ఆధార్ ఓటీపీ కూడా ఎంటర్ చేయాల్సి ఉంటుంది. తత్కాల్ టికెట్ బుకింగ్‌లో అక్రమాలకు అడ్డుకట్టవేసి నిజమైన ప్రయాణికులకు టికెట్లు దక్కేలా చూడడమే లక్ష్యంగా ఈ విధానాన్ని తీసుకొస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఇంతకీ ఆధార్ అథంటికేషన్ ప్రక్రియను ఎలా పూర్తి చేయాలో ఇప్పుడు చూద్దాం..

### ఆధార్ అథంటికేషన్ ఇలా..

- ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ లేదా ఐఆర్‌సీటీసీ రైల్ కనెక్ట్ యాప్‌లోకి లాగిన్ అవ్వండి.
- అందులో 'మై అకౌంట్ సెక్షన్'లోకి వెళ్లి 'అథంటికేట్ యూజర్' ఆప్షన్‌పై క్లిక్ చేయండి.
- అక్కడ ఆధార్ నంబర్ లేదా వర్చువల్ ఐడీ నంబర్ ఎంటర్ చేసి వెరిఫై డీటెయిల్స్‌పై క్లిక్ చేయండి.
- మీ ఆధార్‌కు అనుసంధానం అయిన మొబైల్ నంబర్‌కు వచ్చే ఓటీపీని ఎంటర్ చేయండి.
- దిగువన ఉన్న టర్మ్స్ అండ్ కండీషన్స్ చెక్ బాక్స్ క్లిక్ చేసి సబ్మిట్ చేయడంతో ఆధార్ అథంటికేషన్ పూర్తి అవుతుంది.
- ఒకవేళ ఇది వరకే ఆధార్ అథంటికేషన్ పూర్తి చేసి ఉంటే మై అకౌంట్‌లోకి వెళ్లి అథంటికేషన్ స్టేటస్‌ను చెక్ చేసుకోవచ్చు.
- మై ప్రొఫైల్ విభాగంలోకి వెళ్లి మీ వ్యక్తిగత ప్రొఫైల్‌ను కూడా పూర్తి చేయండి. మెయిల్ ఐడీ, ఫోన్ నంబర్ వివరాలు అసంపూర్తిగా ఉంటే వాటిని పూర్తి చేయండి.

## 25న హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ రూ.12500 కోట్ల ఐపీఓ




**న్యూఢిల్లీ :** ప్రముఖ ప్రైవేటు రంగ బ్యాంక్ హెచ్‌డీఎఫ్‌సీ అనుబంధ ఎన్‌బీఎఫ్‌సీ హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఎట్టకేలకు ఐపీఓకు వస్తోంది. జూన్ 25 నుంచి సబ్‌స్క్రిప్షన్ ప్రారంభం కానుంది. 27న ముగియనుంది. జూన్ 24న యాంకర్ ఇన్వెస్టర్లకు బిడ్డింగ్ విండో తెరుచుకోనుందని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది. పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ.12,500 కోట్లను హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ సమీకరించనుంది. ఐపీఓలో భాగంగా రూ.2,500 కోట్ల ఈక్విటీ షేర్లను తాజా షేర్ల రూపంలో విక్రయించనున్నారు. రూ.10 వేల కోట్లు ఆఫర్ ఫర్ సేల్ ద్వారా విక్రయించనున్నారు. ప్రమోటర్ అయిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఆ మేర వాటాలను వదలుకోనుంది. ప్రస్తుతం ఈ ఎన్‌బీఎఫ్‌సీలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు 94.36 శాతం వాటా ఉంది. అప్పర్ లేయర్ నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు తప్పనిసరిగా మార్కెట్‌లో లిస్ట్ అవ్వాలన్న ఆర్‌బీఐ ఆదేశాల నేపథ్యంలో హెచ్‌డీబీ ఫైనాన్షియల్ పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. పబ్లిక్ ఇష్యూ ద్వారా సమకూరిన నిధులను కంపెనీ టైర్-1 క్యాపిటల్ బేస్‌ను పెంచుకోవడానికి, భవిష్యత్ అవసరాలు, రుణాల జారీ, వ్యాపార వృద్ధికి కంపెనీ వినియోగించనుంది. పబ్లిక్ ఇష్యూ అనంతరం కూడా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ సంస్థ అనుబంధంగానే కొనసాగుతుంది. పబ్లిక్ ఇష్యూలో ఉద్యోగులకు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్ హోల్డర్లకు రిజర్వేషన్ కల్పిస్తోంది. జులై 2న స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ కానుంది.

## సాఫ్ట్ డ్రింక్స్‌పై రిలయన్స్ ఫోకస్

### అతిపెద్ద పెట్టుబడికి సిద్ధం




ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ కన్జూమర్ ప్రోడక్ట్స్ సంస్థ శీతల పానీయాల వ్యాపారంపై దృష్టిసారించింది. ఈ వ్యాపారంపై పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమవుతోంది. రాబోయే 12-15 నెలల్లో దాదాపు రూ.8 వేల కోట్లకు వరకు పెట్టుబడులు పెట్టాలని భావిస్తోందని సంబంధిత వర్గాలు తెలిపాయి. తద్వారా శీతల పానీయాల విభాగంలో పెప్సీ, కోకాకోలా వంటి బహుళజాతి సంస్థలతోపాటు దేశీయంగా ఉన్న చిన్న బ్రాండ్లకు సైతం సవాలు విసరాలని చూస్తోంది. రిలయన్స్ రిటైల్ వెంచర్స్ లిమిటెడ్ ద్వారా 2022లో శీతల పానీయాల విభాగంలోకి రిలయన్స్ ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. కాంపా కోలా, సోస్యో సాఫ్ట్‌డ్రింక్స్‌తో పాటు స్పిన్నర్ స్పోర్ట్స్ డ్రింక్, సన్‌క్రష్ జ్యూస్, ఇండిపెండెన్స్ వాటర్ బాటిళ్లను విక్రయిస్తోంది. వీటి ఉత్పత్తిని మరింత పెంచేందుకు 10-12 గ్రీన్‌ఫీల్డ్, కో-ప్యాకింగ్ ప్లాంట్లను ఏర్పాటుచేయాలని కంపెనీ భావిస్తోంది. ఇందుకోసం రూ.6-8 వేల కోట్ల వరకు పెట్టుబడి పెట్టాలనుకొంటోంది. రిలయన్స్ కన్జూమర్ ప్రోడక్ట్స్ లిమిటెడ్ పెట్టబోయే పెట్టుబడుల్లో ఇప్పటివరకు ఇదే అత్యధికం కావడం గమనార్హం. రిలయన్స్‌తో పాటు, భాగస్వామ్య కంపెనీలు కలిసి ఈ మొత్తాన్ని పెట్టుబడిగా పెట్టనున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో గువాహటిలో జెరిఖో ఫుడ్స్ అండ్ బేవరేజస్ ఎల్ఎల్‌పీతో కలిసి సాఫ్ట్ డ్రింక్స్, వాటర్ బాటిళ్ల ఉత్పత్తి ప్లాంట్‌ను నెలకొల్పింది. ఈశాన్య ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకొని ఈ ప్లాంట్‌ను కంపెనీ ఏర్పాటుచేసింది. త్వరలో బిహార్‌లోనూ ఇలాంటి ప్లాంట్ అందుబాటులోకి రాబోతోంది. రాబోయే 12-15 నెలల్లో దేశవ్యాప్తంగా 10-12 ప్లాంట్లను నెలకొల్పేందుకు రిలయన్స్ సమాయత్తం అవుతోంది. తద్వారా మార్కెట్‌లోకి విస్తృతంగా తమ సాఫ్ట్ డ్రింక్స్‌ను అందుబాటులో ఉంచాలన్నది రిలయన్స్ ప్లాన్.

## ఐఫోన్‌లో యూట్యూబ్ వాడే వారికి గూగుల్ అప్‌డేట్



యాపిల్ ఐఫోన్ యూజర్లకు అలర్ట్. ఐఫోన్‌లో యూట్యూబ్ యాప్ వాడుతున్నవారు వెంటనే యాప్‌ను మళ్లీ ఇన్‌స్టాల్ చేసుకోవాలని గూగుల్ సూచించింది. యాప్ పనితీరుపై యూజర్ల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఈ అప్‌డేట్ ఇచ్చింది. సమస్యను పరిష్కరించామంటూ ఓ ప్రకటన విడుదల చేసింది. ఐఫోన్‌లో యూట్యూబ్ యాప్ ఓపెన్ చేసినప్పుడు క్రాష్ అవ్వడం, ఫ్రీజ్ అవ్వడం వంటి సమస్యలు ఇటీవల కాలంలో కొందరు యూజర్లకు తలెత్తాయి. ప్రపంచవ్యాప్తంగా ఐఓఎస్ యూజర్లకు ఈ సమస్య ఉత్పన్నమయ్యింది. కొందరు ఆండ్రాయిడ్ యూజర్లూ ఇదే తరహా సమస్య ఎదుర్కొన్నట్లు గూగుల్‌కు ఫిర్యాదులు అందాయి. దీంతో గూగుల్ స్పందించి సమస్యను పరిష్కరించింది. ముఖ్యంగా ఐఫోన్ యూజర్లు మాన్యువల్‌గా యాప్‌ను రీ ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించింది. ప్రస్తుతం ఉన్న యాప్‌ను డిలీట్ చేసి ఫోన్‌ను ఓసారి రీస్టార్ చేయాలని గూగుల్ సూచించింది. ఆపై యాపిల్ స్టోర్‌లోకి వెళ్లి లేటెస్ట్ వెర్షన్ యూట్యూబ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొంది. దీనివల్ల క్రాష్ అవ్వడం వంటి సమస్యలు భవిష్యత్‌లో తలెత్తబోవని పేర్కొంది. అయితే, యాడ్ బ్లాకర్, థర్డ్ పార్టీ యాప్‌లను ఉపయోగించే యూజర్లకూ యాప్ క్రాష్ అవ్వడం వంటి సమస్యలు ఉన్నాయి. అయితే, యాడ్ బ్లాకర్లను వినియోగించే వారిని గూగుల్ అడ్డుకోవడంతో ఈ పరిస్థితి నెలకొంటోందని టెక్ వర్గాలు చెబుతున్న మాట!

## సోనీ పిక్చర్స్ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్‌గా ముకుంద్ ఆచార్య



సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్స్ ఇండియా తన కొత్త చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్‌గా ముకుంద్ ఆచార్యను నియమిస్తున్నట్లు ప్రకటించింది. ఇది 2025, జూన్ 19 నుంచి అమలులోకి వస్తుంది. ముకుంద్ ఆచార్య..తన కొత్త ఉద్యోగ బాధ్యతల్లో భాగంగా, ఎంటర్‌ప్రైజ్ టెక్నాలజీ గ్రూప్, టెక్నాలజీ, బ్రాడ్‌కాస్ట్ ఆపరేషన్స్ అండ్ నెట్‌వర్క్ ఇంజనీరింగ్‌తో సహా సంబంధించిన ఏకీకృత టెక్నాలజీ పోర్ట్‌ఫోలియోను పర్యవేక్షిస్తారు. టెక్నాలజీ బృందాలకు నాయకత్వం వహించడంలో ముకుంద్‌కు 29 సంవత్సరాలకు పైగా అనుభవముంది. దీనికి ముందు, ఈయన డిస్నీ హాట్‌స్టార్(ఇప్పుడు జియోస్టార్)లో ఇంజనీరింగ్ హెడ్‌గా పనిచేశారు. అక్కడ ఈయన జియో సినిమా, హాట్‌స్టార్ ప్లాట్‌ఫామ్స్ ఇంటిగ్రేషన్‌లో పాల్గొన్నారు. 2023, 2024, 2025లో ప్రపంచ కప్‌ల వంటి ప్రధాన క్రీడా కార్యక్రమాలకు నాయకత్వం వహించారు.

## వారెన్ బఫెట్.. ఈ ఏడాది రూ.52వేల కోట్ల విరాళం..



**వాషింగ్టన్:** ప్రపంచ కుబేరుల్లో ఒకరైన వారెన్ బఫెట్ మరోసారి తన గొప్ప మనసు చాటుకున్నారు. దాతృత్వ కార్యక్రమాల కోసం ఈ ఏడాది 6 బిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో దాదాపు రూ.52వేల కోట్లు) విలువైన బెర్క్‌షైర్ హాథ్‌వే వాటాలను విరాళంగా ప్రకటించనున్నారు. దీనిపై త్వరలోనే ప్రకటన చేయనున్నట్లు తెలుస్తోంది. బెర్క్‌షైర్ హాథ్‌వే సీఈఓ అయిన బఫెట్ 2006 నుంచి ఏటా జూన్‌లో ఇలా దాతృత్వ కార్యక్రమాల కోసం తన వాటాల్లో కొంత విరాళంగా ఇస్తోన్న సంగతి తెలిసిందే. ఈ మొత్తాన్ని గేట్స్ ఫౌండేషన్‌తో పాటు తన కుటుంబానికి చెందిన నాలుగు ఫౌండేషన్లకు అందజేస్తున్నారు. ఏటా తాను విరాళమిచ్చే వాటాల్లో 5శాతాన్ని బఫెట్ తగ్గిస్తూ వస్తున్నారు. అయితే, బెర్క్‌షైర్ కంపెనీ షేర్ల విలువ పెరుగుతుండటంతో ఈ విరాళాల మొత్తం కూడా పెరుగుతోంది. గతేడాది జూన్‌లో ఆయన విరాళాల ప్రకటన చేసిన తర్వాత నుంచి ఇప్పటివరకు కంపెనీ షేరు విలువ 19శాతం పెరిగింది. 2006 నుంచి ఇప్పటివరకు బెర్క్‌షైర్ కంపెనీల్లో తన వాటా నుంచి సగానికంటే ఎక్కువే బఫెట్ విరాళంగా ఇచ్చేశారు. దీంతో ఆయనకు ఇప్పుడు కంపెనీలో 198119 క్లాస్-ఎ షేర్లు ఉన్నాయి. వీటి విలువ ప్రస్తుతం దాదాపు 144 బిలియన్ డాలర్లుగా ఉంది. బఫెట్ ఏటా ఇచ్చే విరాళాల్లో అత్యధికం అంటే దాదాపు 75శాతం గేట్స్ ఫౌండేషన్‌కే వెళ్తుంది. మిగతా మొత్తం తన కుటుంబానికి చెందిన స్వచ్ఛంద సంస్థలకు కేటాయించారు.




## మరోసారి నష్టాల్లో ముగిసిన సూచీలు

**ముంబయి :** ఇరాన్- ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో మన సూచీలు మరోసారి నష్టాల్లోనే ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలు, క్రూడాయిల్ ధరల్లో హెచ్చుతగ్గులు దీనికి తోడయ్యాయి. ప్రతీకార సుంకాల అమలుకు ట్రంప్ విధించిన 90 రోజుల విరామం గడువు సమీపిస్తుండడంతో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. దీంతో రోజంతా మోస్తరు శ్రేణిలో కదలాడిన సూచీలు.. స్వల్ప నష్టాల్లో ముగిశాయి. బ్లూచిప్ స్టాక్స్ స్వల్ప స్థాయిలో కదలాడగా.. మిడ్, స్మాల్ క్యాప్ స్టాక్స్ మాత్రం అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్ ఉదయం 81,403.94 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,444.66) స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 81,191.04- 81,583.94 పాయింట్ల మధ్య కదలాడింది. చివరికి 82 పాయింట్ల నష్టంతో 81,361.87 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 18.80 పాయింట్ల నష్టంతో 24,793.25 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.72గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో అదానీ పోర్ట్స్, బజాజ్ ఫైనాన్స్, టెక్ మహీంద్రా, ఇండస్ ఇండ్ బ్యాంక్, నెస్లే ఇండియా షేర్లు నష్టాల్లో ముగిశాయి. మహీంద్రా అండ్ మహీంద్రా, టైటాన్, ఎల్‌అండ్‌టీ, భారతీ ఎయిర్‌టెల్, మారుతీ సుజుకీ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 76.90 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3,392 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## నాకు చాలా సంతోషంగా ఉంది

**- రష్మిక మందన్న**

నేషనల్ క్రష్ రష్మిక మందన్న తరచూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటుందన్న విషయం తెలిసిందే. ఈ బ్యూటీ ఏ ముహూర్తాన సినీ ఇండస్ట్రీలో అడుగుపెట్టిందో తెలియదు.. కానీ వరుస బ్లాక్ బస్టర్ హిట్లతో దూసుకుపోతుంది. ఒకేసారి రెండు, మూడు సినిమాలతో ఫుల్ బిజీ అయిపోతుంది. దాదాపు రష్మిక మందన్న నటించిన సినిమాలన్నీ సూపర్ హిట్ టాక్ సొంతం చేసుకున్నవే. అయితే ఈ బ్యూటీ తాజాగా నెట్టింట ఓ పోస్ట్ పెట్టింది. 'మీ చుట్టూ ఉండటం నాకు చాలా సంతోషంగా ఉంది. నేను ఇక్కడ నన్ను నేను పునరావృతం చేసుకుంటున్నానని నాకు తెలుసు కానీ నేను ఆ రోజు చెప్పినట్లుగా.. మనతో ఇంకా ఎంత సమయం ఉందో మనకు తెలియదు, సమయం ఎంతుంటుందో.. మనం భవిష్యత్తు ఊహించలేము.. కాబట్టి దయచేసి ఒకరికొకరు దయగా ఉండండి, మీ పట్ల దయగా ఉండండి. మీకు అత్యంత ముఖ్యమైన పనులు చేయండి'. అంటూ పోస్ట్‌లో రాసుకొచ్చింది. అంతేకాకుండా ఈ ముద్దుగుమ్మ బ్యూటిఫుల్ పిక్స్ పంచుకుంది. రష్మిక మరో రెండ్రోజుల్లో కుబేర సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ మూవీలో టాలీవుడ్ సీనియర్ హీరో నాగార్జున అండ్ ధనుష్ కథానాయకులుగా నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్ర ప్రమోషన్స్ జోరుగా జరుగుతున్నాయి. ఈ మూవీ కూడా బ్లాక్ బస్టర్ హిట్ కొడుతుందని అభిమానుల అంచనా. కుబేర కూడా మంచి టాక్ సొంతం చేసుకుంటే ఇక రష్మికకు సినీ ఇండస్ట్రీలో తిరుగులేదని చెప్పుకోవచ్చు.





## రైతు కూడబెట్టిన 2లక్షల బుగ్గిపై ప్రస్తావన

### కుబేర ప్రమోషన్లలో శేఖర్ కమ్ముల

శేఖర్ కమ్ముల దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం కుబేర. తమిళ నటుడు ధనుష్, టాలీవుడ్ నటుడు నాగార్జున, రష్మిక మందన్నా ఈ సినిమాలో ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. పాన్ ఇండియా వైడ్‌గా ఈ చిత్రం జూన్ 20న శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా వరుస ప్రమోషన్స్‌లో పాల్గొంటున్నాడు దర్శకుడు శేఖర్ కమ్ముల. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గోన్న ఆయన 2021లో జరిగిన ఒక సంఘటన గురించి పంచుకున్నాడు. కూతురి పెళ్లి కోసం ఒక రైతు 2 లక్షలు దాచుకోగా.. ఆ డబ్బు మంటల్లో కాలిపోతే శేఖర్ కమ్ముల అతడికి ఆర్థిక సహాయాన్ని అందించాడు. విషయం గురించి తాజాగా మాట్లాడుతూ.. కూతురి పెళ్లి కోసం ఓ రైతు దాచుకున్న డబ్బు కాలిపోయిందని తెలిసి నా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఎంతో కష్టపడి సంపాదించిన ఆ డబ్బు అలా కాలిపోవడం నన్ను తీవ్రంగా కలిచివేసింది. బాగా డబ్బున్నవాడికి నోట్ల కట్టలు మంటల్లో కాలిపోతే కేవలం బాధేస్తుంది, అలాంటిది ఒక పేద రైతు కష్టపడి సంపాదించిన డబ్బు అలా కాలిపోతే అతడి బాధేంటే అర్థం చేసుకోనవసరం లేదు. అతడి కష్టం ఇలా వృథా అవ్వడం నా మనసును బాగా కదిలించింది. అందుకే ఆ రైతుకు నా వంతు సహాయంగా రూ. 2లక్షలు పంపించాను. అంటూ శేఖర్ చెప్పుకోచ్చాడు. అసలు ఏం జరిగిందంటే.. 2021లో సూర్యాపేట జిల్లా, మునగాల మండలం, నేలమర్రికి చెందిన కప్పల లక్ష్మయ్య అనే రైతు పూరిల్లు అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. ఈ ఘటనలో ఆయన తన కూతురు పెళ్లి కోసం బీరువాలో దాచుకున్న 2 లక్షల రూపాయల నగదు మంటల్లో కాలిపోయాయి. అయితే ఈ విషయం తెలుసుకున్న దర్శకుడు శేఖర్ కమ్ముల చలించిపోయారు. వెంటనే స్పందించి, లక్ష్మయ్య కుటుంబానికి అండగా నిలిచారు. నేరుగా రైతు బ్యాంక్ ఖాతాకు రూ. 2 లక్షల ఆర్థిక సహాయాన్ని పంపించారు. అంతేకాకుండా, లక్ష్మయ్య కుటుంబంతో స్వయంగా మాట్లాడి, అవసరమైతే మరింత సాయం చేస్తానని హామీ ఇచ్చారు. ముందుగా కూతురి పెళ్లిని మంచిగా, సంతోషంగా జరిపించాలని కోరారు.



## 'థగ్ లైఫ్'కు రక్షణ కల్పిస్తాం

### : సుప్రీంకు వెల్లడించిన కర్ణాటక ప్రభుత్వం

ప్రముఖ నటుడు కమల్ హాసన్ నటించిన 'థగ్ లైఫ్' సినిమా స్క్రీనింగ్‌కు ఎట్టకేలకు రక్షణ కల్పిస్తామని కర్ణాటక ప్రభుత్వం నుంచి హామీ లభించింది. ఈమేరకు ఆ రాష్ట్ర ప్రభుత్వం నేడు సుప్రీంకోర్టుకు వెల్లడించింది. దీంతో కన్న డనాట ఈ చిత్రంపై అనధికారిక బ్యాన్‌కు సంబంధించి దాఖలైన ప్రజాప్రయో జనాల వ్యాజ్యం (పిల్) విచారణను జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ మన్మోహన్ బెంచ్ ముగించింది. నేడు ఈ పిల్‌పై న్యాయస్థానం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా బెంచ్ పలు కీలక వ్యాఖ్యలు చేసింది. తరచూ మనోభావాలు దెబ్బతిన్నాయంటూ పలు సంఘాలు ఆందోళనలు చేయడంతో కళాసృష్టి నిలిచిపోతోందని పేర్కొంది. "వీటిని ఇక ఏమాత్రం కొనసాగనీయం. కేవలం ఒక అభిప్రాయం వల్ల ఒక చిత్రాన్ని ఆపేయాలా..? స్టాండప్ కామెడీని నిలిపి వేయాలా..?" అని బెంచ్ ప్రశ్నించింది. ఈ చిత్రం స్క్రీనింగ్‌కు అనుమతులు మంజూరు చేయాలని కర్ణాటకలోని బెంగళూరుకు చెందిన ఎం.మహేష్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. జూన్ 17న ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం కర్ణాటక ప్రభుత్వానికి కీలక సూచనలు చేసింది. సీబీఎఫ్‌సీ నుంచి అనుమతి వచ్చిన ఈ చిత్ర ప్రదర్శనను ఆందోళనకారులు అడ్డుకోకుండా చూడాలని పేర్కొంది. ఈ నేపథ్యంలో సినిమాకు రక్షణ కల్పిస్తామని ఆ రాష్ట్ర ప్రభుత్వం నిన్న ప్రమాణపత్రాన్ని కోర్టులో దాఖలు చేసింది. దీంతో నేడు పిల్‌ను ముగించింది. కన్నడ భాషపై కమల్ చేసిన వ్యాఖ్యల వివాదం నేపథ్యంలో ఈ సినిమాను కర్ణాటకలో నిషేధించిన సంగతి తెలిసిందే.




## పెళ్లి జరిగిన రోజే వధువు మరణం

### థ్రిల్లింగ్ వెబ్‌సిరీస్ ట్రైలర్ రిలీజ్..

అభిజ్ఞా, చరణ్ ప్రధాన పాత్రల్లో నటించిన వెబ్‌సిరీస్ 'విరాటపాలెం: పీసీ మీనా రిపోర్టింగ్'. కృష్ణ పోలూరు దర్శకత్వం వహించిన ఈ సిరీస్ జూన్ 27 నుంచి జీ5 వేదికగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని ట్రైలర్‌ను విడుదల చేశారు. 1980ల నాటి మారుమూల భయానక గ్రామమైన విరాటపాలెం చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఆ ఊరికి ఉన్న శాపం ఏంటి? ఆ ఊర్లో ప్రతి వధువు పెళ్లి రోజున ఎందుకు మరణిస్తుంటుంది. దశాబ్ద కాలంగా వివాహాలు ఎందుకు జరగడం లేదు.. ఇలాంటి ఆసక్తికర అంశాలతో సాగే కథగా ఈ సిరీస్ రూపొందినట్లు ట్రైలర్ ఆధారంగా తెలుస్తోంది.




## 21న కన్నప్ప ప్రీ రిలీజ్ ఈవెంట్


### ప్రభాస్ వస్తాడా అన్నదే ప్రశ్న

మంచు విష్ణు హీరోగా, ముకేశ్ కుమార్ సింగ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న పౌరాణిక చిత్రం 'కన్నప్ప'. జూన్ 27న విడుదల కాబోతున్న ఈ భారీ చిత్రంలో పలువురు స్టార్ అందరు భాగం అవుతున్నారు. కానీ ప్రేక్షకులను థియేటర్లకు రపించేది మాత్రం ప్రభాస్ ఒక్కరే అన్నది ఇండస్ట్రీలో స్పష్టంగా వినిపిస్తున్న మాట. ఈ విషయాన్ని విష్ణు కూడా బాగా తెలుసుకున్నారు. అందుకే సినిమా ట్రైలర్‌లో ప్రభాస్‌కి ఎక్కువ స్క్రీన్ స్పేస్ ఇచ్చేలా ప్లాన్ చేశారు. ఈ చిత్రంలో ప్రభాస్ పాత్ర సుమారు అరగంట పాటు ఉండనుందని, ఇది తన కెరీర్‌లో ప్రత్యేకంగా నిలిచే సినిమా అవుతుందని ప్రభాస్ కూడా ఇప్పటికే పలు సందర్భాల్లో చెప్పుకొచ్చారు. అయితే తాజాగా ఈ మూవీ ప్రీ-రిలీజ్ ఈవెంట్‌కు సంబంధించిన వార్త వైరల్ అవుతుంది. జూన్ 21న హైదరాబాద్‌లో సాయంత్రం 6 గంటలకు ఈ ప్రీ-రిలీజ్ వేడుక ఘనంగా జరగనుంది. ఇందులో నటించిన స్టార్ అందరితో పాటు మిగతా టీమ్ మొత్తం హాజరు కానుంది. కానీ ప్రభాస్ హాజరవుతాడా? అన్నది పెద్ద ప్రశ్నగా మారింది. ఇక ప్రభాస్ కూడా హాజరైతే ఈ ఈవెంట్‌కి మరింత జోష్ వస్తుందని అందరూ ఆశిస్తున్నారు. ఇప్పటికే మోహన్ బాబు వ్యక్తిగతంగా ఫోన్ చేసి ప్రభాస్‌ను ఆహ్వానించాడట. మరి చూదాం డార్లింగ్ వస్తారో రారో..

## నేరుగా ఓటిటిలోకి ఉప్పకప్పరంబు



ఇండస్ట్రీలో కొన్ని కలయికలను అసలు ఎవరూ ఊహించలేం. అలాంటి కలయికల్లో ఒకటి సుహాస్, కీర్తి సురేష్. వీరిద్దరి కాంబోలో 'ఉప్పు కప్పురంబు' అనే సినిమా తేరకెక్కిన్న సంగతి తెలిసిందే. అని. ఐ. వి శశి దర్శకత్వంలో ఈ సినిమాకు వసంత్ మరలీ కృష్ణ కథ అందించగా, ఎల్లనార్ ఫిల్మ్స్ ప్రై. లి బ్యానర్ పై రాధికా లావు నిర్మిస్తున్నారు. 90ల బ్యాక్ డ్రాప్ లో రూపొందిన ఈ సినిమాలో సెటైర్, కామెడీతో పాటూ ఓ సామాజిక సమస్య గురించి కూడా ప్రస్తావించినట్టు మేకర్స్ తెలిపారు. ఈ సినిమా ఆహ్లాదకరంగా, సెటైరికల్‌గా ఉంటూనే ఆడియన్స్ ను ఎంతో ఆలోచింపచేసేదిగా ఉండనుందట.కాగా ఈ చిత్రం థియేటర్లలో కాకుండా నేరుగా ఓటీటీలో రిలీజ్ కానుంది. ఇప్పటికే ఓటీటీ రిలీజ్ డేట్‌ను కూడా అనౌన్స్ చేశారు మేకర్స్ .. 'ఉప్పు కప్పురంబు' సినిమా జులై 4 నుంచి ప్రపంచ వ్యాప్తంగా 240కు పైగా దేశాల్లో ప్రైమ్ వీడియోలో స్పెషల్ గా ప్రీమియర్ కానున్నట్టు తెలిపారు. తెలుగులో రిలీజ్ కానున్న ఈ సినిమా తమిళ, హిందీ, మలయాళ, కన్నడ భాషల్లో డబ్బింగ్ తో అందుబాటులోకి రానుంది. అయితే ఇప్పటికే టీజర్ ఆకట్టుకోగా.. తాజాగా ఈ మూవీ ట్రైలర్ కూడా రిలీజ్ చేశారు. కాగా ట్రైలర్ గనుక పరిశీలిస్తే.. ఊరి స్మశానంలో ఇంకా కేవలం నలుగురికి మాత్రమో చోటు ఉంటుంది. ఊరి పెద్దగా అధికారంలోకి వచ్చిన కీర్తి సురేష్ దాని ఎలా సాల్వ్ చేసింది? అనేది స్టోరి. కాగా విలేజ్ డ్రాప్ లో పూర్తి ఎంటర్ ట్రైనింగ్ మూవీ గా వస్తున్న ఈ మూవీలో కీర్తి లుక్ మొత్తం మార్చేసింది. చాలా రోజులకు బాబుమోహాన్ మంచి కం బ్యాక్ ఇచ్చినట్లు తెలుస్తోంది. సుహాస్ కూడా మంచి కామెడీ టైమింగ్ తో ఆకట్టుకున్నారు. టోటల్ గా ట్రైలర్ మాత్రం కాస్త కన్ఫ్యూజన్ గాను ఇటు ఎంట్టంల్గ÷నింగ్ గాను ఆకట్టుకుంది.




## 8 వసంతాలతో లక్ పరీక్షించుకోనున్న కేరళ కుట్టి

మలయాళ ఇండస్ట్రీ నుండి ఎంతో మంది ముద్దుగుమ్మలు టాలీవుడ్‌లో తమ లక్ పరీక్షించుకునేందుకు వస్తుంటారు. అలా వచ్చిన మరో ముద్దుగుమ్మ అనంతిక సనిల్ కుమార్. 15 ఏళ్లకే యాక్టింగ్ కెరీర్‌లోకి అడుగుపెట్టింది ఈ కేరళ కుట్టీ. బేసికల్లీ క్లాసిక్ డ్యాన్సర్. యాక్టింగ్ పై ప్యాషన్‌తో నటనవైపు అడుగులేసిన అనంతిక రాజమండ్రి రోజ్ మిల్క్ చిత్రంతో టాలీవుడ్ తెరంగేట్రం చేసింది. మ్యాడ్‌లో నార్నే నితిన్‌కు జోడీగా నటించి బ్లాక్ బస్టర్ హిట్‌ను తన ఖాతాలో వేసుకుంది. కానీ ఆ ఆనందాన్ని మిగల్చేదు తమిళ ఇండస్ట్రీ. కోలీవుడ్‌లో నటించిన రెండు చిత్రాలు రైడ్, లాల్ సలామ్ బాక్సాఫీస్ దగ్గర బోల్తా పడ్డాయి. దీంతో కెరీర్ డైలామాలో పడిపోతున్న టైంలో వచ్చిందే 8 వసంతాలు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న 8 వసంతాలు మరికొన్ని గంటల్లో టాలీవుడ్ ప్రేక్షకులను పలకరించబోతోంది. పొయెటిక్, ఫీల్ గుడ్ మూవీగా తీసుకు వస్తున్న ఈ సినిమా కథ ఆమె చుట్టూనే తిరుగుతోంది. అయితే కుబేరకు పోటీగా రాబోతుంది. స్టార్ హీరోలకే థియేటర్లకు రావడం కష్టమౌతున్న ఈ టైంలో ఓ ఉమెన్ సెంట్రిక్ అండ్ లవ్ స్టోరీతో వస్తున్నసినిమా కోసం థియేటర్లకు వస్తారా అన్న డౌట్ వస్తోంది.

### పెద్ది సినిమా నుంచి

## మరో లుక్ విడుదల



రామ్‌చరణ్ హీరోగా, జాన్వీ కపూర్ హీరోయిన్‌గా బుచ్చి బాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ చిత్రం 'పెద్ది'. ఇప్పటికే భారీ హైప్‌ను సెట్ చేసుకున్న ఈ ప్రాజెక్ట్‌లో చాలామంది క్రేజీ స్టార్‌లు భాగమవుతున్నారు. వారిలో ఓటిటిలో సంచలనంగా నిలిచిన 'మిర్జాపూర్' సిరీస్ ఫేమ్.. మున్నా భయ్యా అంటేనే గుర్తుకు వచ్చే దివ్యేంద్ర శర్మ కూడా ఉన్నారు. ఈ సినిమాలో దివ్యేంద్ర శర్మ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఇటీవల విడుదలైన అతడి ఫస్ట్ లుక్ పోస్టర్ మంచి స్పందన రాబట్టింది. తాజాగా మేకర్స్ మున్నా భయ్యా పుట్టినరోజు సందర్భంగా మరో స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో దివ్యేంద్ర క్రికెట్ బాల్ పట్టుకుని మాస్ లుక్‌లో పవర్‌ఫుల్ అవతారంలో కనిపిస్తున్నాడు. కాగా అతను ఈ సినిమాలో 'రామ్ బుజ్జి' అనే పాత్రలో కనిపించనున్నారని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఇప్పటికి ఈ పోస్టర్ సోషల్ మీడియాలో ట్రెండింగ్ అవుతుండగా ఫ్యాన్స్‌లో హైప్ పెంచేస్తోంది. ఈ భారీ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. వృద్ధి సినిమాస్ నిర్మాణం వహిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 27న గ్రాండ్‌గా విడుదల కానుంది.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98,
**RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com